పెన్ పవర్
ఉభయ గోదావరి
కాకినాడ । డా॥బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ । తూ॥ గోదావరి । ప॥ గోదావరి । ఏలూరు






# శిధిలావస్థకు చేరిన షెడ్డులోనే

# జగ్గంపేట ప్రభుత్వ ఐటీఐ కాలేజీ

## గత ఏడు సంవత్సరాలుగా జూనియర్ కాలేజీ షెడ్డులోనే క్లాసులు నిర్వాహణ

**స్థలం కేటాయించినా భవనం నిర్మాణానికి వెనకడుగు**

**జిల్లాలో కాకినాడ తర్వాత జగ్గంపేటలోనే ప్రభుత్వ ఐటీఐ కాలేజీ**

**పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు**

**అడిగితే నిధులు లేవంటూ మాటదాటివేత**

**జగ్గంపేట, పెన్ పవర్, జూలై 25:** కాకినాడ జిల్లా జగ్గంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల పక్కనే ఉన్న షెడ్డులో తాత్కాలికంగా ప్రభుత్వ ఐటీఐ కాలేజీ నిర్వహిస్తున్నారు. 2018లో మొదలైన ఈ కాలేజీకి ఇప్పటికీ పక్కా భవనం నిర్మాణం కాలేదు. గత ఏడు సంవత్సరాలుగా జూనియర్ కాలేజీలోని షెడ్డులో ఉంటూనే క్లాసులు చెపుతున్నారు. విద్యార్థులు, అధ్యాపకులకు కావాల్సిన కనీస మరుగుదొడ్డి సౌకర్యం కూడా లేదు ఇక్కడ. అందులోను ఈ షెడ్డు శిధిలావస్థకు చేరుకుంది. వర్షాలు వస్తున్న సమ యంలో నీరు లోనికి రాకుండా షెడ్డుపై తార్పాలిన్లు కల్పి, లోపల సీలింగ్ కి సిల్వర్ కవర్లు వేసి తాత్కాలిక చర్యలు తీసుకున్నారు. దీనికి తోడు ఈ షెడ్డు జూనియర్ కాలేజీకి సంబంధించినది కావడంతో వాళ్లు ఎప్పుడు వెళ్లిపోమంటారో తెలియని పరిస్థితి నెలకొంది. ఇప్పటికే దీనిపై రెండు మూడు సార్లు షెడ్డు మాకు ఇచ్చేయండి మీకు భవనం నిర్మాణం కోసం అధికారులు, ప్రభుత్వంతో మాట్లాడుకోండి అని జూనియర్ కాలేజీ వాళ్లు ఐటీఐ వాళ్లకు చెప్పినట్లు సమాచారం. దీంతో ఐటీఐ కాలేజీ వాళ్లు స్థానిక ప్రజాప్రతినిధిని కలిసి విషయం తెలిపిన నిధులు లేవంటూ మాట దాటవేసినట్లు తెలియవచ్చింది.



### స్థలమైతే కేటాయించారు నిర్మాణమే జరగలేదు

జగ్గంపేట ప్రభుత్వ డిగ్రీ కాలేజీ వద్ద ఐటీఐ కాలేజీకి స్థలం కేటాయించినప్పటికీ పక్కా భవనం ఏర్పాటు చేయకపోవడంపై పలు విమర్శలకు తావిస్తోంది. కాకినాడ, కోనసీమ జిల్లాలో కాకినాడ, కోనసీమ తర్వాత జగ్గంపేటలో మాత్రమే ప్రభుత్వ ఐటీఐ కాలేజీ ఉంది. అలాంటి ప్రభుత్వ ఐటీఐ కాలేజీకి భవనం నిర్మించకపోవడం ప్రభుత్వం, అధికారుల అలసత్వమనే చెప్పాలి. విద్యార్థులు కూర్చుని తినేందుకు గదులు లేకపోవడంతో క్లాసు రూము ల్లో బెంచీలపైనే తిని అక్కడే క్లాసులు వింటున్నారు. ప్రస్తుతం క్లాసులు నిర్వహిస్తున్న షెడ్డు శిధిలావస్థకు చేరుకోవడం, మరుగుదొడ్డి సౌకర్యం లేకపోవడం ఇతర సమస్యలతో కాలేజీ అధ్యాపకులు, విద్యార్థులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక కాలేజీ నిర్మాణం జరుగుతుందని ఎన్నో ఆశలు పెట్టుకున్న అధ్యాపకులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఢీలా పడ్డారు. కూటమి ప్రభుత్వం కేవలం సూపర్ సిక్స్ పథకాల అమలుపై దృష్టి పెట్టిందే కాని భవన నిర్మాణాలను పూర్తిగా పక్కన పెట్టేసిందని పలువురు మండిపడుతున్నారు. ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ దీనిపై దృష్టి పెట్టి ఐటీఐ కాలేజీ నిర్మాణానికి నిధులు మంజూరు చేయించి భవనం నిర్మించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు..



### కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తా..

ప్రభుత్వ ఐటీఐ కాలేజీ నిర్మాణంపై స్థానిక అధికారులు, నాయకులు దృష్టి సారించాలి. కాలేజీ విద్యార్థులు, అధ్యాపకులు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారు. స్థలం కేటాయించి ఏడేళ్లు గడుస్తున్నా కాలేజీ నిర్మించకపోవడం సిగ్గుచేటు. గొప్పలు చెప్పుకునే ప్రభుత్వం ఈ కాలేజీ నిర్మాణం చేపట్టాలి. తక్షణమే దీనిపై ప్రభుత్వంతో మాట్లాడి భవనం నిర్మాణానికి నిధులు సమకూర్చాలి. ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తాను.

- బహుజన సమాజ్పార్టీ జగ్గంపేట ఇన్చార్జి జుత్తుక నాగేశ్వరరావు



# లోక్ అధాలత్ కేసుల పరిష్కారంలో జగ్గంపేట మొదటి స్థానం

## జగ్గంపేట ఎస్సై రఘునాధరావుకు ఎస్పీ అభినందనలు

**జగ్గంపేట, పెన్ పవర్, జూలై 25:** జగ్గంపేట ఎస్సై టి.రఘునాథ రావు విశేష కృషితో లోక్ అధాలత్ కేసుల పరిష్కారంలో కాకినాడ జిల్లాలో జగ్గంపేట ప్రథమ స్థానంలో నిలిచింది. ఈనెల 5వ తేదీ శనివారం నిర్వహించిన మెగా జాతీయ లోక్ అధాలత్ ద్వారా కాకినాడ జిల్లా జగ్గంపేట పోలీస్ స్టేషన్లోని 116 కేసులలో కక్షిదారులు, ఫిర్యాదుదారులు, ఇరు వర్గాల సభ్యులను సమన్వయం చేసుకుంటూ వారితో మాట్లాడి వారి యొక్క కేసులను లోక్ అదాలత్ కార్యక్రమం ద్వారా పరిష్కరించారు. శుక్రవారం కాకినాడ జిల్లా ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన నెలవారీ నేర సమీక్ష సమావేశంలో జగ్గంపేట ఎస్ఐ రఘునాథరావును అభినందిస్తూ ఎస్పీ బిందు మాధవ్ ప్రశంసా పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎస్సై రఘునాథరావును ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు, స్థానిక ప్రజలు అభినందించారు.

# పాతికేళ్ళ కళ.. నెరవేరింది ఇలా..

## రూ.1.25కోట్ల రహదారి నిర్మాణానికి భూమిపూజ

## ఆనందం వ్యక్తం చేసిన గ్రామస్తులు



**అంబాజీపేట, పెన్ పవర్, జూలై 25:** పాతికేళ్ళ కళ...నెరవేరింది ఇలా..మండలరిధి ఇసుకపూడి గ్రామ రహదారి అభివృద్ధిచేసి సుమారు పాతికేళ్ళు అయ్యిందని నేడు భూమిపూజతో గ్రామస్తుల్లో ఆనందం. గ్రామీణ ప్రాంతాలలో రహదారుల నిర్మాణానికి కూటమి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని, గ్రామ ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని రహదారుల నిర్మాణాలు చేపడుతున్నట్లు పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. మండలంలోని ఇసుకపూడిలో నాబార్డ్ నిధులు రూ.1.25 కోట్లతో 1.7 కిలోమీటర్ల సిసి,బీటీ రోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే సత్యనారాయణ శుక్రవారం భూమిపూజ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో గ్రామీణ ప్రాంతాలలో రహదారుల అభివృద్ధితో పాటు సంక్షేమ పథకాలను కూటమి ప్రభుత్వం చేపడుతు న్నామన్నారు. నియోజకవర్గ అభివృద్దే ధ్యేయంగా పార్టీలు, వర్గాలకతీ తంగా అవసరమైన చోట ఆయా గ్రామ ప్రజల అభీష్టం మేరకు అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు.గత 20 ఏళ్లుగా నిర్మాణానికి నోచుకోని ఇసుకపూడి ప్రధాన రహదారిని అభివృద్ధి చేస్తుంటే గ్రామ ప్రజల్లో హర్షాతిరేఖాలు వ్యక్తం అవుతున్నాయన్నారు. గత మార్చి నెలలో చిరత పూడి ప్రధాన రహదారిని కోటి రూపాయలతో సిసి రోడ్డుగా అభివృద్ధి చేశామని ఎమ్మెల్యే తెలిపారు.స్థానిక ప్రజల,గ్రామ అవసరాలను గుర్తించి ఆయా గ్రామాలను అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఏపీ ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ల ఆలోచనలు, ఆశయాలకు అనుగుణంగా నియోజక వర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ తెలిపారు. అనంతరం ఇసుకపూడి గ్రామస్తులు ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణను గజమాలతో ఘనంగా సత్క రించారు.గ్రామ సర్పంచి తరపట్ల మోహన్ సింగ్ బాబురావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ జేఈ సంపన్,ఇన్చార్జ్ ఎంపీ డీవో ఎ.ఎస్.ఎల్. నరసింహరావు, డిప్యూటీ ఎంపీడీవో కె.శ్రీనివాస్,రాష్ట్ర ఇరిగేషన్ డైరెక్టర్ శిరిగినీడి వెంకటేశ్వ రరావు,ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు,జెడ్పిటిసి బూడిద వరలక్ష్మి, ఎంపీటీసీ ముత్తాబత్తుల ప్రశాంత్, కూటమినాయకులు దాసరి వీర వెంకట సత్యనారా యణ,పెద్దిరెడ్డి వెంకటేశ్వరరావు,మైపాల తాతాజీ, కొర్లపాటి గోపి,పళ్ళ రామ్మూ ర్తి, దొమ్మేటి సాయికృష్ణ,గూడాల ఫణి, రవణం రాము,అరిగెల బలరా మ్మూర్తి,చిన్నం బాల విజయరావు,యనమదల సాయిబాబా,సరెళ్ళ వెంక టేశ్వర్లు, తోట బాబి,మేడిది శ్రీను,వంగా చిన్న తదితరులు పాల్గొన్నారు.



# సామూహిక వరలక్ష్మి పూజలు

**అమలాపురం పెన్ పవర్ జూలై 25:**సఖినేటిపల్లి మండలం, అంతర్వేది గ్రామములో వేంచేసియున్న నవనారసింహ క్షేత్రాలలో ప్రముఖమైన శ్రీ లక్ష్మి నరసింహ స్వామి వారి దేవస్థానం నందు శ్రావణ మాసం మొదటి శుక్రవారం సందర్భముగా ఉదయం గం. 09. 30ని.లకు శ్రీ రాజ్యలక్ష్మి తాయారు అమ్మవారి సన్నిధిలో సాముహిక "వరలక్ష్మి కుం కుమ పూజలు "ఆలయ అర్చక స్వాముల ఆద్వర్యంలో అత్యంత ఘనంగా నిర్వ హిం చడం జరిగినది. ఈ కార్యక్రమములో అత్యధికంగా భక్తులు పాల్గొని శ్రీ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సాముహిక వరలక్ష్మి కుంకుమ పూజల యందు పాల్గొన్న ముత్తైదువులకు ఎటువంటి పూజా రుసుము లేకుండా అమ్మవారి రూపు ,పూజ సామాగ్రి, ఉచితముగా పంపిణి చేయుట జరిగినది. శ్రీ స్వామి వారి దర్శనం, ప్రసాద వితరణ చేసి, నిత్యాన్నదాన విభాగము నందు భోజన వసతిఏర్పాటు చేయుట జరిగిందని ఒక ప్రకటనలో తెలిపారు..

# సింగిల్ యూస్ ప్లాస్టిక్ వస్తువులు ఉపయోగిస్తే జరిమానా



**గోకవరం, పెన్ పవర్, జులై 25 :** రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల ప్రకారం ఇకపై మండలంలో సింగల్ యూస్ ప్లాస్టిక్ ని వినియోగించిన వారికి 2500 రూపాయలు జరిమానా విధించబడుతుందని ఎంపీడీవో ఎం.గోవిందు పత్రికా ప్రకటనలో తెలిపారు. మండలంలోని 14 గ్రామపంచాయితీలలోని 20 గ్రామ సచివాలయాల పరిధిలోను 75 మైక్రాన్ల కంటే తక్కువ ఉన్న సింగిల్ యూస్ ప్లాస్టిక్ కవర్లు, స్ట్రాలు, ప్లాస్టిక్ స్పూన్లు, ప్లాస్టిక్ ప్లేట్లు తదితర ప్లాస్టిక్ వస్తువులు వాడకూడదని ఇప్పటికే అన్ని షాపులకు నోటీసులు జారీ చేయడం జరిగిందని, జిల్లా కలెక్టర్ ఆదేశాల ప్రకారంగా మరొకసారి గోకవరంలోని అన్ని షాపులకు పంచాయతీ కార్యదర్శి బి శిరీష, సచివాలయ సిబ్బందితో కలిసి వెళ్ళి నోటీసులు జారీ చేసి ఇకపై ఎవరైనా నిషేధించిన ప్లాస్టిక్ వాడినట్లయితే రోజుకు 2500 రూపాయలు జరిమానా విధించడం జరుగుతుందని మరొక్కసారి హెచ్చరిక జారీ చేస్తూ నోటీసులు జారీ చేయడమైనదని ఎమ్పీడీఓ గోవిందు చెప్పారు.

# మున్సిపల్ కార్మికులచే స్పెషల్ సానిటేషన్ డ్రైవ్

**అమలాపురం పెన్ పవర్ జూలై 25:** మున్సిపల్ కమీషనర్ వి.నిర్మల్ కుమార్ ఆదేశాలతో అమలాపురం పట్టణంలోని ఎన్టీఆర్ మార్గ్ లో ఉన్న కాటన్ పార్క్ ను,రోడ్ కి ఇరువైపులా పేరుకుని పోయిన ఇసుక , మట్టిలను మున్సిపల్ కార్మికులచే స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ నిర్వహించి,జంగిల్ ను క్లియర్ చేయించి, రోడ్డు అంచుల వద్ద పేరుకుని పోయిన మట్టి,ఇసుక లను తొలగింప చేశారు. బైపాస్ రోడ్డు లో ఉన్న శ్మశాన వాటిక వద్ద మొక్కలను నటించారు. ఈ పారిశుధ్య పనులను ఏఈ కె.వెంకటేష్ , శానిటేషన్ ,ఎన్విరాన్మెంట్ సెక్రెటరీలు పర్యవేక్షించారు.





# ఉపాధి కూలీ బకాయిలు చెల్లించాలని ధర్నా

**తాడేపల్లిగూడెం, పెన్ పవర్, జులై 25:** ఉపాధి కూలీల వేతన బకాయిలు చెల్లించాలని కోరుతూ నవాబుపాలెం సచివాల యం వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఉపాధి కూలీ డబ్బులు బకాయి వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఆందోళన అనంతరం సచివాలయం కార్యదర్శి జి శ్రీనివాసరావుకు వినతి పత్రం అందజేశారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కండెల్లి సోమరాజు మాట్లాడుతూ ఉపాధి కూలీలకు 10 నుండి 12 వారాలు పని చేస్తే కేవలం రెండు వారాలు మాత్రమే డబ్బులు వేసి చేతులు దులుపుకున్నారని తెలిపారు. వ్యవసాయ కూలీలు రెక్కాడితేనే గాని డొక్క నిండని వ్యవసాయ కూలీలు యంత్రాలు పక్క రాష్ట్రాల నుండి వలస కూలీల వల్ల పనులు లేక ప్రధానంగా ఉపాధి పనుల మీదనే బ్రతుకుతుండగా ఈ సంవత్సరం 10, 12 వారాలు పనులు చేస్తే కేవలం రెండు వారాలు మాత్రం డబ్బులు వేయడం దారుణమన్నారు. తక్షణమే ఉపాధి డబ్బులు బకాయిలు ఇవ్వాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేకపోతే ఉపాధి కూలీలంతా ఐక్యమై మండల కేంద్రాల్లో ఆందోళన కార్యక్రమాలు చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. ఉపాధి హామీ ప్రారంభమై గత 18 సంవత్సరాలో ఎప్పుడు ఇన్ని వారాలు బకాయిలు లేవని వారన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి కండెల్లి రమేష్ బాబు. కండెల్లి విజయ నూతంగి సూర్యారావు బై పో ప్రసాద్ దిద్దే అబ్బులు కొల్లి మేరీ ఉండ్రాజ వర పూ భాను బదుగు మరియమ్మ బండి శ్రీనివాస్ రాచర్ల నాగేశ్వరరావు బ్రహ్మయ్య మల్లిపూడి చిట్టి యా కొడమంచిలి సోమరాజు గల్లా మరియమ్మ తదితరులు పాల్గొన్నారు.




# ముద్రగడ సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి రావాలని నూకాలమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు

## పెంటకోట నాగబాబు ఆధ్వర్యంలో 1116 కొబ్బరికాయలు కొట్టిన అభిమానులు

## ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ముద్రగడ సతీమణి పద్మావతి





**కిర్లంపూడి, పెన్ పవర్, జూలై 25:** ఇటీవల అనారోగ్యానికి గురైన మాజీ మంత్రి,పొలిటికల్ అడ్వైజరీ కమిటీ సభ్యులు ముద్రగడ పద్మనాభం త్వరగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో కిర్లంపూడి తిరిగి రావాలని కోరుతూ మాజీ సర్పంచ్ పెంటకోట నాగబాబు ఆధ్వర్యంలో ముద్రగడ అభిమానులు, మూడు గ్రామాల ప్రజలు ముద్రగడ కుటుంబీకుల ఇలవేల్పు అయిన శ్రీ నూకాలమ్మ అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం 1,116 కొబ్బరికాయలు ముద్రగడ అభిమానులు చేతుల మీదుగా కొట్టారు. ముందుగా ముద్రగడ సతీమణి పద్మావతి శ్రీ నూకాలమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి కొబ్బరికాయలు కొట్టి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్బంగా పెంటకోట నాగబాబు మాట్లాడుతూ ముద్రగడ ఆరోగ్యం నిలకడగా ఉందని, ముద్రగడ అభిమానులు ఆయన ఆరోగ్యంపై ఎవరూ అధైర్య పడద్దని,త్వరలోనే సంపూర్ణ ఆరోగ్యంతో హైదరాబాదు నుండి కిర్లంపూడి చేరుకుంటారని నాగబాబు తెలిపారు. ముద్రగడ సంపూర్ణ ఆరోగ్యంతో కిర్లంపూడి తిరిగి రావాలని, కిర్లంపూడిలో వేంచేసియున్న శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలోను, శ్రీ వన దుర్గాదేవి అమ్మవారి ఆలయంలోను,చిల్లంగి చింతలతోటలో వేంచేసియున్న శ్రీ కనక దుర్గాదేవి అమ్మవారి ఆలయంలోను ముద్రగడ అభిమానులు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు, పలు సంఘాల నాయకులు ముద్రగడ ఆరోగ్యం కుదుటపడాలని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ముద్రగడ కుటుంబికులు, కిర్లంపూడి,చిల్లంగి,జగపతినగ రం గ్రామాల్లో ఉన్న ముద్రగడ అభిమానులు, వైసీపీ నాయకులు, పలు సంఘాల నాయకులు, మూడు గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

# పీ4పై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సీఎం చంద్రబాబు సమీక్ష

## కాకినాడ కలెక్టర్ షణ్మోహన్ సహా జిల్లా అధికారులతో సమీక్ష



**కాకినాడ, జూలై 25 పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారు రాష్ట్ర స్థాయిలో అమలు జరుగుతున్న పీ4 (పి4) కార్యక్రమాలపై జూమ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశం అమరావతిలోని రాష్ట్ర సచివాలయం నుంచి నిర్వహించగా, రాష్ట్రవ్యాప్తంగా జిల్లా కలెక్టర్లు, శాసన సభ్యులు పాల్గొన్నారు. కాకినాడ జిల్లా కలెక్టర్ డా. షణ్మోహన్ సగిలి తన క్యాంప్ కార్యాలయం నుంచే వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొని జిల్లాలో పీ4 అమలుపై నివేదికను సమర్పించారు. కలెక్టర్‌తో పాటు సీపీఓ పి. త్రినాథ్, ఇతర ఉన్నతాధికారులు కూడా సమావేశానికి హాజరయ్యారు. ఈ సమావేశానికి కాకినాడ జిల్లాకు చెందిన విభిన్న నియోజకవర్గాల ఎమ్మెల్యేలు, తాము పనిచేస్తున్న ప్రధాన పట్టణాల నుంచి వీడియో లింక్ ద్వారా కలిశారు. ముఖ్యమంత్రి గారు పీ4 కార్యక్రమాల ప్రగతిపై జిల్లా వారీగా సమీక్షిస్తూ, ప్రజలతో నేరుగా మమేకమై ప్రభుత్వ పథకాల అమలును వేగవంతం చేయాలని సూచించారు. పీ4 అంటే %-% ప్రజల కోసం ప్రభుత్వ పరిపాలనలో పారదర్శకత, పరిపూర్ణత, ప్రతిస్పందన, ప్రాధాన్యత అనే నాలుగు మూల సూత్రాలపై ఆధారపడిన విధానం. ఈ విధానం పట్ల అధికార యంత్రాంగం మరింత నిబద్ధతతో పనిచేయాలని ముఖ్యమంత్రి సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా స్థాయి అధికారులతో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొనడం, పాలనలో సమన్వయం, వేగం, ప్రజలతో మమేకత పెంచుతుందన్న అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి.







# అక్రమ కట్టడాలు కూల్చేవరకు పోరాటం ఆగదు

## కుంజా శ్రీను

**చింతూరు, పెన్ పవర్, జూలై 25:** ఏజెన్సీలో గిరిజనేతరుల అక్రమ కట్టడాలు తొలగించేవరకు ఆదివాసి సంక్షేమ పరిషత్ పోరాటం ఆపేది లేదని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజా శ్రీను స్పష్టం చేశారు. చింతూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన ఆదివాసి హక్కుల సాధన చట్టాల అమలు సదస్సులో ఆయన మాట్లాడారు. 1/70 చట్టం అమలులో అధికారుల నిర్లక్ష్యం, ప్రజాప్రతినిధుల చేతకానితనం వల్ల గిరిజనేతరులు ఏజెన్సీలో బలపడుతున్నారని విమర్శించారు. జీవో నెం.3 రద్దుకూ అదే కారణమన్నారు. ఎన్నికల సమయంలో ఓట్లు వేయించు కునే నాయకులు, తర్వాత ఆదివాసులను పట్టించుకోవడం లేదని ధ్వజమెత్తా రు. తక్షణమే చింతూరు డివిజన్‌లోని నాన్ ట్రైబల్స్ అక్రమ కట్టడాలు కూల్చాలంటూ ఐటీడీఏ, తహసీల్దార్ కార్యాలయాలకు ఫిర్యాదు చేశారు. యువత, విద్యార్థులు, ఉద్యోగులు ఉద్యమంలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు.

# రోడ్డు ప్రమాదంలో ఇరువురు యువకులకు గాయాలు..


**అంబాజీపేట,పెన్ పవర్, జూలై 25:** మండలంలోని గంగలకుర్రు అగ్రహారం ముషిణివారిపాలెం వెళ్లే రహదారి మలుపులో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇరువురు యువకులకు గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జి.అగ్రహారం పెదపాలెంకు చెందిన పిల్లి మోహన్, మట్టపర్తి హర్షవర్ధన్లు మోటారు బైక్ పై అంబాజీపేట వస్తున్నారు. ఆ సమయంలో అంబాజీపేట నుండి జి.అగ్రహారం వెళుతున్న కారు, బైక్ ఎదురెదురుగా ఢీ కొన్నాయి. దాంతో మోహన్ హర్షవర్ధన్ లకు గాయాలయ్యాయని తెలిపారు.





# ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

**జీలుగుమిల్లి ,పెన్ పవర్ ,జులై 25:** పోలవరం నియోజకవర్గంలోని ప్రతి మండలంలో ఇటువంటి ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించి ప్రజలకు ఆరోగ్య పరిరక్షణ అందించడమే ముఖ్యమని పోలవరం ఎమ్మెల్యే సిరి బాలరాజు, పోలవరం నియోజకవర్గం జనసేన పార్టీ అధికార ప్రతినిధి గడ్డమణుగు రవికుమార్ అన్నారు. శుక్రవారం జీలుగుమిల్లిలో అంబేద్కర్ యూత్ ఆధ్వర్యంలో మమతా హాస్పిటల్ జంగారెడ్డిగూడెం వారిచే ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని వారు ప్రారంభించారు. సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలు ఆత్మ నిర్భ రత దృష్ట్యా మిషన్ హెూప్స్ అనే స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఉచిత కుట్టు మిషన్లు పంపిణీ చేయడం జరిగింది అని అన్నారు. ఈ సంస్థ ప్రతినిధి జాషువా చేస్తున్న సేవలను ప్రశంసించారు. ఈ వైద్య శిబిరంలో పరీక్షించే ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అంతకుముందు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మండల జనసేన అధ్యక్షులు పసుపులేటి రాము, కూటమి నాయకులు సిరి శ్రీనివాస్, పదం వెంకటకృష్ణ, గుడిల్లి లక్ష్మీనారాయణ, మమతా హాస్పిటల్ వైద్య సిబ్బంది, అంబేద్కర్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.



## జాయింట్ పట్టాదారులు తమ భూములను వ్యక్తిగతంగా విభజించుకునే సౌకర్యం

**డిసెంబర్ 31 వరకు భూ విభజనకు అవకాశం:తహశీల్దార్ లక్ష్మీ లావణ్య**

**తాళ్ళపూడి, పెన్ పవర్, జూలై 25:** తాళ్ళపూడి మండలంలో రీ-సర్వే పూర్తైన గ్రామాలలో వెబ్ ల్యాండ్ 2.0లో జాయింట్ పట్టాదారులుగా నమోదైన భూ యజమానులు, తమ భూములను వ్యక్తిగతంగా విభజించుకునేందుకు 2025 డిసెంబర్ 31వ తేదీ వరకు అవకాశం కల్పించబడిందని తహశీల్దార్ లక్ష్మీ లావణ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈ క్రమంలో భూ విభజన కోసం సాధారణంగా వసూలు చేసే రూ.500 ప్రభుత్వ రుసుమును పూర్తిగా మాఫీ చేయబడినదిగా తెలిపారు. భూ యజమానులు కేవలం రూ.50 నామమాత్రపు దరఖాస్తు రుసుమును గ్రామ సచివాలయంలో చెల్లించి, డిసెంబర్ 31వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాల్సిందిగా సూచించారు. ఈ ప్రత్యేక అవకాశం ద్వారా జాయింట్ పట్టాదారులు తమ భూములను విడిగా నమోదు చేసుకొని, అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం వంటి రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల అర్హతను పొందవచ్చని జాయింట్ కలెక్టర్ తెలియ చేశారు. ఇప్పటికే ఆ పథకాల అమలులో జాయింట్ పట్టాల వల్ల అర్హత రాని వ్యవసాయదారులు, ఈ అవకాశాన్ని వినియోగించు కుంటే వారికి ప్రయోజనం జరుగుతుందని తహశీల్దార్ పేర్కొన్నారు. అన్నదాత సుఖీభవ పథకానికి సంబంధించి ఇబ్బంది ఎదురవుతున్న రైతులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేస్తే వారికి తొలి ప్రాధాన్యతనిస్తూ పరిష్కారం కల్పిస్తామని ఆయన తెలియజేశారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

**ముగ్గురు లబ్ధిదారులకు రూ.3.66 లక్షల సహాయం అందజేసిన ఎమ్మెల్యే పంతం నానాజీ**



**కాకినాడ,పెన్ పవర్ జూలై 25:** కాకినాడ రూరల్ శాసనసభ్యులు పంతం నానాజీ గారు, తమ నియోజకవర్గంలో పదో దఫాగా ముగ్గురు లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎం రిలీఫ్ ఫండ్) ద్వారా మంజూరైన రూ.3,66,423 విలువైన చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమం కాకినాడ గుడారిగుంటలోని ఆయన కార్యాలయం వద్ద బుధవారం జరిగింది.లబ్ధిదారులు గోనెలా లోవరాజు, పెద్దింశెట్టి వీరబ్రహ్మం, దాసరి లక్ష్మి గారులకు ఎమ్మెల్యే నానాజీ స్వయంగా చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సంక్షేమ పథకాలకు అధిక ప్రాధాన్యత ఇస్తోంది అని తెలిపారు. గత ప్రభుత్వ వల్ల ఏర్పడిన ఆర్థిక ఇబ్బందుల మధ్యలోనూ, సీఎం సహాయనిధి ద్వారా ప్రజలకు తక్షణ సహాయం అందించడంలో కూటమి ప్రభుత్వం నిబద్ధతతో ఉంది అన్నారు.ఇప్పటివరకు రూ.1.60 కోట్లు విలువైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు (ఎల్ ఓ సి సహా) 97 మందికి పంపిణీ చేసినట్లు పంతం నానాజీ గారు వెల్లడించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, జన సైనికులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొని లబ్ధిదారులను అభినందించారు.

## ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రై డే

**మున్సిపల్ కమిషనర్ నిర్మల్ కుమార్**



**అమలాపురం పెన్ పవర్ జూలై 25 :**వార్డ్ ఆరోగ్య కార్యదర్శులతో మున్సిపల్ కమీషనర్ వి.నిర్మల్ కుమార్ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు.ఫ్రైడే -డ్రైడే తప్పనిసరిగా ప్రతి శుక్రవారం వార్డులలో నిర్వహించాలని,సీజనల్ వ్యాధులు పట్ల అందరూ సెక్రెటరీలు అప్రమత్తంగా ఉండాలని,పట్టణ ప్రజలకు సీజనల్ వ్యాధులు పట్ల అవగాహన కల్పించాలని,వర్షా కాలంలో ఇళ్లు ,పరిసర ప్రాంతాలలో నీటి నిల్వలు లేకుండా,దోమలు ద్వారా డెంగ్యూ,మలేరియా వంటి వ్యాధులు రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కమీషనర్ వి.నిర్మల్ కుమార్ ఆరోగ్య కార్యదర్శులకు తెలియచేశారు.ఈ సమావేశంలో పట్టణంలోని 15 వార్డ్ సచివాలయాల ఆరోగ్య కార్యదర్శులు పాల్గొన్నారు.

## లింగ నిర్ధారణకు పాల్పడితే చర్యలు

**డి ఎం హెచ్ ఓ డాక్టర్ గీతా బాయి**



**తాడేపల్లిగూడెం, పెన్ పవర్,జూలై 25:** ఎవరైనా లింగ నిర్ధారణకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని, అటువంటి సెంటర్లను సీజ్ చేస్తామని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని డాక్టర్ జి. గీతాబాయి హెచ్చరించారు. డిఎంహెచ్వో పలు ప్రైవేటు ఆసుపత్రులు, స్కానింగ్ సెంటర్లను ఆకస్మిక తనిఖీ చేశారు. దీనిలో భాగంగా తాడేపల్లిగూడెంలోని రవి మాధవ్ నర్సింగ్ హోమ్, విజయ హాస్పిటల్, ముళ్లపూడి వెంకటరమణ మెమెరియల్ హాస్పిటల్, తణుకు పట్టణంలోని ముళ్ళపూడి కార్డియో వాసుక్యులర్ సెంటర్, యునై టెడ్ డయాగ్న స్టిక్ సెంటర్, శ్రీ తేజ హాస్పిటల్ తనిఖీలు నిర్వహించి ఏపీ ఎంసీఇ చట్ట పరిధిలో ఆసుపత్రులు నిబంధనలు పాటించేది లేనిది రికార్డులు పరిశీలించారు. పిసిపిఎ న్డిటి చట్ట పరిధిలో స్కానింగ్ సెంటర్ల నిర్వహణను పరిశీలించి తగు సూచనలు చేశారు. ఏవరైనా లింగ నిర్ధారణకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని, ఆ సెంటర్లను సీజ్ చేస్తామన్నారు.





# అడ్డతీగల మండలంలో ముమ్మరంగా ఎక్సైజ్ దాడులు

**అడ్డతీగల, పెన్ పవర్, జూలై 25బీ** రంపచోడవరం ఎక్సైజ్ సూపర్నెంట్ ఆధ్వర్యంలో అడ్డతీగల మండలంలో శుక్రవారం ముమ్మర దాడులు నిర్వహించారు. అడ్డతీగల మండలంలో గొంటివాని పాలెం ప్రాంతంలో 1200 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం చేసి కేసు నమోదు చేశామని తెలిపారు .అడ్డతీగల మండలానికి మధ్యలో ఉన్న ఏలేశ్వరం మండలానికి చెందిన జడ్డంగి అన్నవరం గ్రామంలో ఆకస్మికంగా దాడులు నిర్వహించి ,సుమారు 1200 లీటర్ల బెల్లం ధ్వంసం చేసి ఒక వ్యక్తిని అరెస్టు చేసామని,ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ శ్రీధర్ తెలిపారు .ఈ దాడుల్లో ప్రత్తిపాడు ఎక్సైజ్ టీంతో కలిసి రంపచోడవరం ప్రత్తిపాడు స్టేషన్ పరిధిలో దాడులు నిర్వహించామని, ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ శ్రీధర్ తెలిపారు. ఎవరి వద్దనైనా నాటు సారాకు సంబంధించి సమాచారం ఉన్నచో, రంపచోడవరం ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ కు సమాచారం అందించాలని, సమాచారం ఇచ్చిన వారి పేర్లు గోపియంగా ఉంచు తామని సీఐ తెలిపారు. ఈ దాడుల్లో ఎస్సై పైడేశ్వరరావు సిబ్బంది పాల్గొన్నారు.

## టీచర్ల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్న ఎంఈఓ ను సస్పెండ్ చేయాలి



**తాడేపల్లిగూడెం, పెన్ పవర్, జూలై 25 :** ఉపాధ్యాయుల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్న మండల విద్యాశాఖ అధికారి హనుమను సస్పెండ్ చేయాలని ఎస్టియు జిల్లా కార్యదర్శి వేదాల ఉదయ్ కుమార్ డిమాండ్ చేశారు. స్థానిక సిపిఐ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎంఈవో తీరు బాధాకర మన్నారు. ఉపాధ్యాయుడిగా పరిచయం చేసుకోవడానికి కార్యాలయానికి వెళ్లిన తన పట్ల ఎంఈవో వి. హనుమ అసహనంగా వ్యవహరించారని తెలిపారు. మండల విద్యాశాఖ అధికారి అయి ఉండి ఆ విధంగా ప్రవర్తించడం సరికాదన్నారు. ఎస్జీటీ ఉపాధ్యాయుడితో ఇతర పనులకు వినియోగించరాదని కమిషనర్ ఆదేశాలు ఉన్నాయన్నారు. నిబంధనలను ఉల్లంఘించడంతో పాటు ఎస్జీటీ ఉపాధ్యాయుడిని అసభ్య పదజాలంతో పిలవడం దారుణమన్నారు. దీనిపై ప్రశ్నించడం జరిగిందన్నారు. ఇదిలా ఉంటే ఈ నెల 15వ తేదీన ఒక ఉపాధ్యాయిని చైల్డ్ కేర్ సెలవు విషయంపై ఎంఈవో కార్యాలయానికి వెళ్ళామన్నారు. అయితే, అదే రోజు రాత్రి ఎంఈవో వి. హనుమ తనకు ఫోన్ చేసి ఇష్టా రీతిగా దుర్భాషలా డారని ఆరోపించారు. తదుపరి రోజు ఈ విషయమై జిల్లా కలెక్టర్, జిల్లా విద్యాశాఖ అధికారి, ఎస్టీయు నాయకత్వానికి విన్నవించామన్నారు. అయినా, కలెక్టర్, డీఈవో నుంచి ఎటువంటి స్పందన లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళ ఉపాధ్యాయినిల పట్ల సైతం అసభ్యంగా ప్రవర్తించడంతో ఆయనతో మాట్లాడేందుకు సైతం వారు భయపడే పరిస్థితి నెలకొందన్నారు. ఎంఈవోను సస్పెండ్ చేయాలని ఎస్టీయూ తరపున డిమాండ్ చేశారు. ఎస్ జి టి ఉపాధ్యాయుడు కే గంగరాజు మాట్లాడుతూ 6 ఏళ్ల వేతన స్కేలు స్థిరీకరణ విషయంలోనూ సదరు ఎంఈవోకు సొమ్ములు ఇస్తే పని అయిపోతుందని ఒక ఉపాధ్యాయుడు చెప్పడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. తాను ఏ తప్పు చేయకుండా షోకాజ్ నోటీసు ఇచ్చారని పేర్కొన్నారు. ఆయన బాధ భరించలేక డిప్యూటేషన్ పై కస్పా పెంటపాడు వెళ్లినట్లు తెలిపారు. ఎంఈవో తీరు బాగోలేదని తెలిపారు. ఎస్ టి యు పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు కొడమంచిలి శ్రీనివాస్, కంకిపాటి గంగరాజు, పెంటపాడు మండల శాఖ అధ్యక్షుడు పైడారావు, ఉపాధ్యక్షుడు తన్నీరు ఆంజనేయులు, పెంటపాడు మండల కార్యవర్గ సభ్యుడు రజనీకాంత్, నూకారపు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

## ముద్రగడ సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి రావాలని చిల్లంగిలో కుంకుమ పూజలు

**ముఖ్యఅతిథిగా పాల్గొన్న ముద్రగడ సతీమణి పద్మావతి**



**కిర్లంపూడి, పెన్ పవర్, జూలై 25:** మాజీ మంత్రి రాష్ట్ర వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పొలిటికల్ అడ్వైజరీ కమిటీ సభ్యులు ముద్రగడ పద్మనాభం సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి రావాలని కిర్లంపూడి మండలం చిల్లంగి చింతలతోటలో వేంచేసియున్న శ్రీ కనకదుర్గ అమ్మవారి ఆలయంలో గ్రామస్తులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు,కుంకుమ పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం సతీమణి పద్మావతి ముఖ్యఅతిథిగా పాల్గొని అమ్మవారిని దర్శించుకుని అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా చిల్లంగి గ్రామానికి చెందిన పలువురు గ్రామస్తులు మాట్లాడుతూ తమ అభిమాన నాయకుడు,మాజీ మంత్రివర్యులు రాష్ట్ర వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పొలిటికల్ అడ్వైజరీ కమిటీ సభ్యులు ముద్రగడ పద్మనాభం సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి రావాలని గ్రామస్తులందరం యాకోస్తులై అమ్మవారిని వేడుకుంటూ ప్రత్యేక పూజలు ,కుంకుమ పూజలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కిర్లంపూడి, జగపతినగరం,చిల్లంగి,పలు గ్రామాల ప్రజలు ముద్రగడ అభిమానులు,వైసిపి నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఇంటర్‌డిస్ట్రిక్ట్ రైడ్‌లో 2400 లీటర్ల పులిసిన బెల్లపు ఊట ధ్వంసం





**ప్రత్తిపాడు, పెన్ పవర్, జూలై 25:** ఎక్సైజ్ కమిషనర్ మరియు డైరెక్టర్ ఆదేశాల మేరకు, డిప్యూటీ కమిషనర్ సూచనలతో కాకినాడ జిల్లా ప్రోహిబిషన్ &ఎక్సైజ్ శాఖ ప్రత్యేక ఇంటర్ డిస్ట్రిక్ట్ రైడ్ నిర్వహించింది. ప్రత్తిపాడు సర్కిల్ పరిధిలో అల్లూరి సీతారామరాజు జిల్లా అధికారుల సహకారంతో జరిగిన ఈ ఆపరేషన్‌లో రెండు జిల్లాల్లో కలిపి మొత్తం 2400 లీటర్ల పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. ఈ దాడిలో, ఏలేశ్వరం నుండి అన్నవరం జడ్డింగ్ గ్రామం వరకు సాగిన సోదాలో 1200 లీటర్ల బెల్లపు ఊటను పట్టుకుని ధ్వంసం చేశారు. ఈ ఘటనలో గంజా మహేశ్వరరావు అనే వ్యక్తిపై పరారీ కేసు నమోదు చేశారు. అదే తరహాలో రంపచోడవరం సర్కిల్ పరిధిలోని గొంతువా నపాలెం గ్రామంలో మరో 1200 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. ఈ ఆపరేషన్‌ను ప్రత్తిపాడు సర్కిల్ ఇన్స్పెక్టర్ పి. శివప్రసాద్ నడిపించారు. అలాగే, ఈ దాడిలో కాకినాడ జిల్లా ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ కె.జ య మౌనిక, అల్లూరి సీతారామరాజు జిల్లా అసిస్టెంట్ సూపరింటెండెంట్ సుబ్రమణ్యం, రంపచో దవరం ఇన్స్పెక్టర్ శ్రీధర్, అలాగే ప్రత్తిపాడు ఎక్సైజ్ సబ్ ఇన్స్పెక్టర్ పున్నం వంశీ రామ్ సిబ్బందితో కలిసి పాల్గొన్నారు.

# స్మార్ట్ మీటర్లను ఆపాలి




**తాడేపల్లిగూడెం, పెన్ పవర్, జూలై 25:** ప్రజలపై మరింత కరెంటు భారాలు వేసే అదాని ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్ లు ఇళ్లకు బిగించే చర్యలను తక్షణమే ఆపాలని సిపిఎం పట్టణ కార్యదర్శి కరెడ్ల రామకృష్ణ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. సిపిఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో 5 వ రోజు అదానీ స్మార్ట్ మీటర్లు వ్యతిరేకించాలని ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంచారు. కడకట్ల, రామారావు పేట లలో ప్రచార ర్యాలీ నిర్వహించారు. పట్టణ కార్యదర్శి కరెడ్ల రామకృష్ణ మాట్లాడుతూ పెంచిన కరెంటు చార్జీలను తగ్గించాలని, ప్రజలపై అదనపు భారాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాత్రి 6 గంటలు నుండి 10 గంటలు వరకు అధిక రేట్లు వసూలు చేస్తారని ఆవేదన వ్యక్తం చేశారు.ఇప్పటికే ప్రభుత్వ కార్యాలయాలకు, వ్యాపార సంస్థలకు, షాపులకు స్మార్ట్ మీటర్లు బిగించారని, బిగించిన తరువాత కరెంట్ బిల్లులు షాక్ కొట్టేలా ఉన్నాయని ప్రజానీకం గగ్గోలు పెడుతున్నారని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మీద మండిపడ్డారు. సిపిఎం పార్టీ నిరంతరం ప్రజల కోసం నీతి, నిజాయితీగా పోరాట ాలు చేస్తుందని ఆయన అన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు స్మార్ట్ మీటర్లు పగలగొట్టాలని పిలుపు ఇచ్చిన మంత్రి లోకేష్ అధికారంలోకి వచ్చిన తర్వాత స్మార్ట్ మీటర్లు పేరుతో భారాలు మోపడాన్ని సిపిఎం తీవ్రంగా ఖండిస్తున్నదని ధ్వజమెత్తారు. మీటరుకయ్యే ఖర్చు సింగిల్ ఫేజ్ కి 8927 రూపాయలు,3 ఫేజ్ కి 17286 రూపాయలు మనం చెల్లించాలని,వీటికీ 93 నెలల్లో మీటరు అద్దె కస్టమర్ నుండి నెలవారీ వాయిదాలుతో వసూలు చేయాలని టిడిపి కూటమి ప్రభుత్వం చూస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు .గతంలో చెత్త పన్ను చెల్లించకు ండా సిపిఎం పార్టీ పెద్ద ఎత్తున పోరా టాలు చేసిందని గుర్తుచేశారు. ఇప్పుడు స్మార్ట్ మీటర్లుకు వ్యతిరేకంగా పోరాడుదాం అని పట్టణ ప్రజలకు పిలుపునిచ్చారు. స్మార్ట్ మీటర్లు బిగింపు ను ఆపకపోతే దశల వారీ ఆందోళన కార్యక్రమాలు చేపట్టి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు తగు బుద్ధి చెబుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమానికి శిద్దిరెడ్డి శేషుబాబు, పోతు శ్రీను, అన్నం చిన్నారావు, కన్నంరెడ్డి శివాజీ, దత్తు రాము,నగిరెడ్డి సాయి, బర్ల బాలాజీ, బొడ్డపాటి శివ,యడ్ల శ్రీను,కొమ్మిరెడ్డి ఉదయ్ కుమార్,పతివాడ నాగేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

# ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించిన ఎస్ఐ జయ బాబు

**మహిళల భద్రత, శక్తి యాప్ వినియోగం, సైబర్ నేరాలపై జాగ్రత్తలు మరియు రోడ్డు భద్రత అంశాలపై అవగాహన కార్యక్రమం.**






**టి.నరసాపురం, పెన్ పవర్, జూలై 25:** జగ్గవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించిన ఎస్ఐ జయ బాబు .ఏలూరు జిల్లా ఎస్పీ కె. ప్రతాప్ శివ కిషోర్, ఐపీఎస్ ఆదేశాలపై పోలవరం డీఎస్పీ ఎం. వెంకటేశ్వర రావు పర్యవేక్షణలో జీలుగుమిల్లి ఇన్స్పెక్టర్ బి. వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో మరియు టీ.నరసాపురం ఎస్ఐ జయబాబు నేతృత్వంలో నిర్వహించబడింది.

**శక్తి యాప్ అవగాహన:** మహిళలు అత్యవసర సమయంలో పోలీసుల సహాయం పొందేందుకు శక్తి యాప్ ఎంతో ఉపయోగకరమని, అందరూ తప్పనిసరిగా తమ ఫోన్లలో శక్తి యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. మహిళా భద్రతపై ఇంటర్నెట్, మోడరన్ కమ్యూనికేషన్ వేదికల వాడకంలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలు, వాటిపై చట్టబద్ధమైన పరిష్కార మార్గాలు వివరించారు.

**సైబర్ నేరాలపై హెచ్చరికలు:** సోషల్ మీడియా మోసాలు, ఫేక్ అకౌంట్లు, డేటా షేరింగ్ వల్ల ఎదురయ్యే ప్రమాదాలు గురించి విద్యార్థులకు వివరించి, డిజిటల్ భద్రత పాటించాల్సిన విధానాలను క్లుప్తంగా వివరించారు.

**రోడ్డు భద్రత:** ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నా, హెల్మెట్, సీటు బెల్ట్ వాడకాన్ని అలవాటు చేసుకోవాలి. యువత ట్రాఫిక్ నియమాలను ఉల్లంఘిస్తే వారి భవిష్యత్తు ప్రమాదంలో పడవచ్చని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జగ్గవరం హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు,పోలీస్ సిబ్బంది విద్యార్థిని, విద్యార్థులు పాల్గొని శక్తి యాప్ ను ద్వారా మహిళల, బాలికల భద్రత పట్ల ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లుగా ఎస్ఐ జయ బాబు తెలిపారు.





## రంపచోడవరం కేంద్రంగా కారం తమ్మన్న దొర జిల్లా ఏర్పాటు చేయాలి..

### తెల్లం శేఖర్ ఏపీ ఆదివాసీ జేఏసీ డిమాండ్

**దేవీపట్నం,పెన్ పవర్,జూలై25:** రంపచోడవరం కేంద్రంగా తొలి మన్యం వీరుడు, స్వాతంత్ర్య సమర యోధుడు కారం తమ్మన్న దొర పేరు మీదుగా కొత్త జిల్లాను ఏర్పాటు చేయాలని ఏపీ ఆదివాసీ జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్ తెల్లం శేఖర్ డిమాండ్ చేశారు.దేవీపట్నం మండలం పోతవరం గ్రామంలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో జరిగిన కారం తమ్మన్న దొర 145వ వర్ధంతి కార్యక్రమంలో ఆయన మాట్లా డారు.1839లో జన్మించిన కారం తమ్మన్న దొర,బంధపల్లి గ్రామానికి చెందిన కోయ ముఠాదార్‌గా రంపచోడవరం కేంద్రంగా స్వాతంత్ర్య పోరాటం నడిపారని,ఐదుగురు ముఠాదారుల మద్దతుతో 30 మంది ఆదివాసుల సాయుధ బలగాన్ని ఏర్పాటు చేసి బ్రిటిష్ ప్రభుత్వంపై యుద్ధాలు సల్పారని వివరించారు.స్వదేశీ ఉద్యమానికి బీజం వేసిన రంప తిరుగుబాటుకు ఆయన నాంది పలికారని, 1880 జూలై 25న బ్రిటిష్ సైన్యంతో యుద్ధం చేస్తూ వీరమరణం పొందిన దొర పేరు చరిత్రలో చిరస్థాయిగా నిలిచేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

**ఈ సందర్భంగా రంపచోడవరం కేంద్రంగా..**

కారం తమ్మన్న దొర పేరుతో జిల్లా ఏర్పాటు చేయాలి... దొర జీవిత చరిత్రను పాఠ్యపుస్తకాల్లో చేర్చాలి... ఆయన విగ్రహాన్ని రంపచోడవరం కేంద్రంలో ఏర్పాటు చేయాలి...ప్రత్యేక ట్రైబల్ మ్యూజియం స్థాపించాలి..వర్ధంతిని రాష్ట్ర అధికారిక వేడుకలుగా నిర్వహించాలి, అని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కారం సురేష్ దొర, ఇన్‌చార్జ్ హెచ్‌ఎం జి.రాజు, ఉపాధ్యాయులు మడకం రామకృష్ణ దొర, ఎం.గోపాల్ కృష్ణ, బులియమ్మతో పాటు హాస్టల్ విద్యార్థులు పాల్గొన్నారు.కార్యక్రమం ప్రారంభంలో కారం తమ్మన్న దొర చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఉపాధ్యాయులు దొర వీరత్వాన్ని వివరించే ప్రసంగాలు నిర్వహించారు.

## బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు సన్మానం




**తాళ్ళపూడి, పెన్ పవర్, జులై 25:** అన్నదేవరపేట ఎంపీపీ స్కూల్(మెయిన్) నుండి ఇటీవల బదిలీపై వెళ్లిన నలుగురు ఉపాధ్యాయులను పాఠశాలలో ఘనంగా సత్కరించడం జరిగింది. జి.రామచంద్రరావు, జే.డి.సునీత, సిహెచ్.మహేష్, జి.రవికుమార్‌లు బదిలీపై వివిధ పాఠశాలలకు వెళ్లారు. వీరందరికి శుక్రవారం సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సన్మానగ్రహీతలు మాట్లాడుతూ పాఠశాలతో, గ్రామస్తులతో గల అనుబంధం గుర్తుచేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి.డి.వి.కె.ప్రసాద్, ఉపాధ్యాయులు జిరాజారత్నం, కే.ప్రసన్నకుమార్, బి.శంకర్, ఈ. సత్యనారాయణ, ఎస్ఎంసి కమిటీ సభ్యులు, విద్యార్థులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## కొమరం భీం విగ్రహం ధ్వంసం చేసిన వారిపై కేసు నమోదు

### సెల్ఫీ దిగుతున్న క్రమంలో విగ్రహం చెయ్యి ధ్వంసం

**కూనవరం,పెన్ పవర్,జూలై 25:** మండలంలోని కోతులగుట్ట నందు ఎంపీడీవో ఆఫీస్ సమీపంలో ఈ నెల 9న రాత్రి సమయంలో కొమరం భీమ్ విగ్రహం చెయ్యి ధ్వంసం చేశారని ఆదివాసి నాయకులైన కుంజ అనిల్ ఈనెల 11న కూనవరం పోలీస్ స్టేషన్ నందు కంప్లైంట్ ఇవ్వడంతో కేసు నమోదు చేశామని ఎస్ ఐ లతాశ్రీ పత్రికా ప్రకటన ద్వారా తెలిపారు.విగ్రహ ధ్వంసం కేసు దర్యాప్తులో భాగంగా శుక్రవారం నాడు ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకోవడం జరిగిందని, ఇద్దరు మైనర్ వ్యక్తులు కావడం గమనార్హం. సదరు ముగ్గురు వ్యక్తులు ఈనెల 9న అర్ధరాత్రి సమయంలో కొమరం భీం విగ్రహం వద్దకు వెళ్లి ఫోటోలు తీసుకుందామని తుంటరి పనులు చేస్తూ ఉండగా ముగ్గురులో ఒకరు కొమరం భీమ్ విగ్రహంతో సెల్ఫీ ఫోటో దిగుదామని విగ్రహం వద్దకు వెళ్లి ఫోటో దిగుతున్న క్రమంలో విగ్రహం చెయ్యి ధ్వంసం అయిందని తెలిపారు.భయంతో వారు అక్కడనుండి ముగ్గురు వ్యక్తులు వెళ్లిపోయారని,ధ్వంసం చేసిన ముగ్గురు వ్యక్తులపై చట్ట ప్రకారం తదుపరి చర్యలు తీసుకుంటామని ఎస్ ఐ లతా శ్రీ పత్రికా ప్రకటన ద్వారా తెలిపారు.ఈ కేసుకు సంబంధించి అసత్య ఆరోపణలు చేయడం కానీ,వర్గ సంబంధిత రెచ్చగొట్టే ప్రకటనలు ఎవరు చేయకూడదని తెలిపారు.ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా రాత్రి 10 గంటల తరువాత అత్యవసరమైతే తప్ప ప్రజలు ముఖ్యంగా యువత బయట తిరగరాదని, ఎవరైనా బయటకు వచ్చినా వ్యక్తిగత ఆధారాలు తప్పకుండా ఉండాలని లేనియెడల వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## అమలాపురం నియోజకవర్గ కూటమిలో కుమ్ములాట...



**పెన్ పవర్ అమలాపురం జులై 25:** కూటమినేతల్లో బయటపడ్డ విభేదాలు.... పదవులన్నీ టిడిపికేనా అంటూ ఆవేదన... పిఏసిఎస్ చైర్మన్,డైరెక్టర్ల ఎంపిక విషయంలో తమకు కనీస ప్రాదాన్యం కల్పించలేదంటూ అమలాపురం రూరల్ మండలం ఇందుపల్లి గ్రామంలో జనసేన నేతల ఆందోళన.టిడిపి ఫ్లెక్సీలపై పవన్ కళ్యాణ్ ఫోటోలు లేకుండా వేస్తున్నారంటూ మండిపడ్డ నేతలు. జరుగుతున్న అన్యాయంపై పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్తామంటూ జనసేన నేతల ఫైర్.

# పోలీసుల ఎదుట లొంగిపోయిన మావోయిస్టు పార్టీ సభ్యురాలు



**ఎటపాక, పెన్ పవర్,జూలై 25:** అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక పోలీస్ స్టేషన్లో మావోయిస్టు పార్టీ సభ్యురాలు కొవ్వాసి దేవే అలియాస్ సుమిత్ర ఓ ఎస్ డి జగదీష్ అడహళ్లి ఐపీఎస్ ఎదుట లొంగిపోయారు, లొంగిపోయిన మావోయిస్టు సభ్యురాలును సాల్వతో సన్మానించి జనజీవన స్రవంతిలోకి ఆహ్వానించారు, అనంతరం ఎటపాక మండల పోలీస్ స్టేషన్లో మీడియా సమావేశం ఏర్పాటు చేసి వివరాలను ఓఎస్డి జగదీష్ ఆడహళ్లి ఐపీఎస్ వెల్లడించారు, వివరాల్లోకి వెళితే... మావోయిస్టు పార్టీ సిద్ధాంతాలకు విసిగిపోయి జనజీవన స్రవంతిలో కలవడానికి మావోయిస్టు పార్టీ సభ్యురాలు కొవ్వాసి సుమిత్ర పోలీసుల ఎదుట లొంగిపోయిందని, ఈమె ఛత్తీస్గఢ్ రాష్ట్రం,సుకుమా జిల్లా, కొంటా పోలీస్ స్టేషన్ పరిధిలోని గంగరాజపాడు గ్రామానికి చెందిన మహిళని ఈమె వయసు 24 సంవత్సరాలు, మావోయిస్టు సభ్యురాలు సుమిత్రకు 22 సంవత్సరాల వయసులో ఉన్నప్పుడు మడకం.కోసి ఏసియం,కుంట ఎల్ ఓ ఎస్ కమాండర్, సుమిత్రాన్ని ప్రేరేపించి కొంట ఎల్వో ఎస్ చేర్పించి , సైనిక శిక్షణ కూడా ఇప్పించారు, అనంతరం బెటాలియన్ హెడ్ క్వాటర్ కంపెనీ లో ఉన్న ఏ సెక్షన్కు బదిలీ చేశారు, 2023 నవంబర్ నెలలో మడకం అనిల్, ఎస్ జెడ్ సి ఎం, బెటాలియన్ హెచ్ క్యూ కమాండర్, ఆమెకు పార్టీ సభ్యురాలుగా పదోన్నతి ఇచ్చి బీజీఎల్ ఆయుధంతో ఐదు రౌండ్ల కేటాయించారు, 2024 ఫిబ్రవరి నెలలో ఆమెకు 30 రైతులు ఇచ్చి 11 రౌండ్లను కేటాయించారు, అప్పటినుంచి ఆమె బెటాలియన్ లో కొనసాగుతోందని తెలిపారు, ధర్మవరం సిఆర్పిఎఫ్ క్యాంపుపై 2024 జనవరి నెలలో ఎటాక్ చేసిన ఘటనలో మడివి.హెద్మా బెటాలియన్ కమాండర్ తో పాటు తొమ్మిది వందల మంది సభ్యులు పాల్గొన్నారు, ఈ ఘటనలో ముగ్గురు మావోయిస్టులు మరణించారని, 2024 జనవరి నెలలో జీరగూడ సిఆర్పిఎఫ్ క్యాంపుపై 500 మందితో ఎటాక్ చేసిన ఘటనలో సుమిత్ర కూడా ఉందని ఆ ఘటనలో ఇద్దరు జవాన్లు ముగ్గురు మావోయిస్టులు మరణించారని తెలిపారు, ఇన్ని ఘటనలో పాల్గొన్న ఆమె మావోయిస్టు సిద్ధాంతాలు మనుషుల ప్రాణాలు తీయటంలో వెనక ఆడటం లేదని అటువంటి సిద్ధాంతాలను అనుసరిస్తే ఎంతోమంది అమాయక ప్రాణాలు బలి తీసుకోవడం జరుగుతోందని ఉద్దేశంతో ఆ సిద్ధాంతాలకు విసిగిపోయిన కొవ్వాసి .దేవే



అలియాస్ సుమిత్ర పోలీసుల ఎదుట లొంగిపోయిందని తెలిపారు, లొంగిపోయిన మావోయిస్టులకు రాష్ట్ర ప్రభుత్వం వారిని గుర్తించి వారికి కావాల్సిన ఉపాధి అవకాశాలను ఏర్పాటు చేస్తూ వారిపై ఉన్న రివార్డులను అందజేస్తూ ప్రోత్సహిస్తుందని అన్నారు, అదేవిధంగా పరివర్తన కార్యక్రమం జిల్లాలో సత్ఫలితాలను అందిస్తుందని, గిరిజన ప్రజలకు ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాలతో ప్రజలకు పోలీసులు చేరువవుతున్నారని, స్ఫూర్తి ప్రేరణ ఒంటి కార్యక్రమాల ద్వారా ఎంతో మంది గిరిజన యువతి యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పించబడుతున్నాయని, అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం పునరావాస విధానం, సరెండర్ రివార్డ్ అమౌంట్ తో పాటు భూమి, ఉద్యోగం మరియు ఉపాధి లాంటి కార్యక్రమాలను చేపట్టడం ద్వారా అనేకమంది మావోయిస్టు పార్టీకి చెందిన సభ్యులు పోలీసుల ఎదుట లొంగిపోతున్నారని అన్నారు, అదేవిధంగా గుత్తి కోయల సమస్యలను తెలుసుకొని వారి సమస్యలను పరిష్కరించే దిశగా ఉన్నత అధికారులతో మాట్లాడుతామని అన్నారు, మావోయిస్టులకు రాష్ట్ర ప్రభుత్వం అనేక విధాలుగా సహాయ సహకారాలను అందిస్తోంది కనుక మావోయిస్టు పార్టీ నుంచి మావోయిస్టు పార్టీ సభ్యులు పోలీసుల ఎదుట స్వచ్ఛందంగా లొంగి పోవాలని ఆహ్వానించారు, లొంగిపోయిన మావోయిస్టులు ప్రభుత్వం ఆదుకుంటుందని తెలిపారు,ఈ కార్యక్రమంలో 141 బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ చేతన్ బీఆర్,141 బెటాలియన్ ఇనస్పెక్టర్ టివి సుబ్బయ్య,212 బెటాలియన్ సుబేదర్ మేజర్ ఎస్పి సింగ్ ,ఎటపాక సర్కిల్ ఇనస్పెక్టర్ కన్నపరాజు,ఎస్సై అప్పలరాజు ,పోలీసు ,సీఆర్పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.



## రానేలంక సొసైటీ అధ్యక్షుడుని అభినందించిన నాగభూషణం

**అమలాపురం పెన్ పవర్ జూలై 25 :** ముమ్మిడివరం మండలం రాణేలంక సొసైటీ అధ్యక్షునిగా జనసేన నాయకులు గోదశి పుండరీష్ ప్రమాణ స్వీకారం జరిగింది. ఈ సందర్భంగా కాట్రేనికోన మండలం చెయ్యేరు గ్రామానికి చెందిన జనసేన నాయకులు త్సవటపల్లి నాగభూషణం నూతన సొసైటీ అధ్యక్షునికి బొకే అందజేసి అభినందనలు తెలియజేశారు.



# నాన్న ఆరోగ్యం బాగానే ఉంది

### ప్రజా అభిమానానికి ఎప్పటికీ రుణపడి ఉంటాం.

### ముద్రగడ పెద్ద కుమారుడు ముద్రగడ వీర్రాఘవరావు

**కిర్లంపూడి, పెన్ పవర్, జూలై 25:** మా తండ్రి, మాజీ మంత్రి,రాష్ట్ర వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పొలిటికల్ అడ్వైజరీ కమిటీ సభ్యులు ముద్రగడ పద్మనాభం ఆరోగ్యం బాగానే ఉందని ముద్రగడ పెద్ద కుమారుడు ముద్రగడ వీర్రాఘవరావు (బాలు)ఒక ప్రకటనలో తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మా తమ్ముడు ముద్రగడ గిరిబాబు నాన్న దగ్గర ఉండి వైద్యం చేయిస్తున్నాడని ఎప్పటికప్పుడు వైద్యులతో మాట్లాడి నాన్న ఆరోగ్యం మెరుగుపడేలా తగు జాగ్రత్తలు తీసుకుంటున్నాడన్నారు. నాన్నగారి ఆరోగ్యం కోసం దేవాలయాల్లో ప్రత్యేక పూజలు చేస్తున్న ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని మా కుటుంబం పట్ల మీరు చూపిస్తున్న అభిమానం మరవలేనిదన్నారు. నాన్న ఆరోగ్యం కోసం మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్నందుకు మా కుటుంబం ఆయనకు ఎప్పటికీ రుణపడి ఉంటుందని ఈ సందర్భంగా తెలియజేశారు.



## జలకళ సంతరించుకున్న మద్దిగడ్డ ప్రాజెక్ట్

**అడ్డతీగల,పెన్ పవర్, జూలై 25:** ఇటీవల కురుస్తున్న వర్షాలకు మండలానికి జీవనాడి అయినా మద్దిగడ్డ ప్రాజెక్ట్ జలకళ సంతరించుకుంది. ఇప్పటివరకు అడపాదపగా వర్షాలు కురిసినప్పటికీ రైతుల కు నీరు కరువైంది. పంటలు వేయాలా వద్దా అన్న ఆలోచనలో ఉన్న రైతులకు మద్దిగడ్డ ప్రాజెక్టు ఇబ్బంది లేని విధంగా సగానికి పైగా నీరు నిండడంతో, రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పంటలు సమ యా నికి ఏ ఇబ్బంది లేకుండా ఉందని, ఇంకొక రెండు మూడు వర్షాలు కురిస్తే ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరుకుంటుందని, రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

# నవంబర్‌లోపు అన్ని ప్రభుత్వ భూముల రీ సర్వే, గ్రామాల సరిహద్దుల నిర్ధారణ పూర్తి చేయాలి

### సీసీఎల్ఏ డా.ఎన్.ప్రభాకర్ రెడ్డి






**రాజమహేంద్రవరం, పెన్ పవర్, స్టాఫ్ రిపోర్టర్, జులై 25:** ప్రభుత్వ భూముల గుర్తింపు, గ్రామాల సరిహద్దుల నిర్ధారణకు ఉద్దేశించిన మూడవ ఫేజ్ రీ సర్వేను నవంబర్ లోపు పూర్తి చేయాలని భూ పరిపాలన శాఖ అదనపు కమిషనర్ డాక్టర్ ఎన్.ప్రభాకర్ రెడ్డి జిల్లా రెవెన్యూ అధికారులకు సూచించారు. శుక్రవారం ఉదయం స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో రెవెన్యూ, రీ సర్వేపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి, జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్న రాముడు లతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా అదనపు సీసీఎల్ఏ డా.ఎన్.ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ తహసిల్దార్లు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. సర్వీస్ ఇనాం భూములను సంస్థాగత, వ్యక్తిగత అనే రెండు విభాగాలుగా వర్గీకరించారని చెప్పారు. సంస్థాగత ఇనాం భూమికి అనుభవదారు యజమాని కాదని, దానికి సంబంధిత సంస్థే యజమాని అని చెప్పారు. వీటిని 22ఏ(1)(సి) లో చూపాలన్నారు. ఆర్టిజన్ ఇనాంలు, వ్యక్తిగత ఇనాంల విభాగంలోకి వస్తాయని, వీటిని ఫ్రీ హెూల్డ్ చేయమని గతంలోనే ఉత్తర్వులు ఇచ్చినట్లు చెప్పారు. సర్వే, మ్యుటేషన్ సమయంలో నోటీసులు ఇవ్వడం లేదన్న ఫిర్యాదులు అధికంగా వస్తున్నాయని, వీటిపై దృష్టి సారించాలని, తప్పనిసరిగా నోటీసులు అందేలా చూడాలన్నారు. నోటీసులు అందినట్టు ఆధారాలు చూపకుంటే సంబంధిత అధికారిపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. గ్రామ రెవెన్యూ కోర్టులను తప్పక నిర్వహించాలన్నారు. గ్రామ సభలు నిర్వహించిన తర్వాత కూడా ఫిర్యాదులు ఎందుకు వస్తున్నాయో పరిశీలించాలని చెప్పారు. రీ సర్వే డిటి, వీఆర్వోలు తప్పనిసరిగా క్షేత్రస్థాయికి వెళ్లేలా చర్యలు చేపట్టాలన్నారు. రీ సర్వే పూర్తయిన చోట రికార్డులను మరోసారి జాగ్రత్తగా వెరిఫై చేయాలని చెప్పారు. సరిహద్దులు మారితే దానికి గల కారణాలు నమోదు చేయాలన్నారు. ప్రభుత్వ భూములు అన్ని రక్షింపబడ్డాయని(ప్రొటెక్ట్) సర్టిఫికెట్ తీసుకోవాలని చెప్పారు. భూమి పూర్తి విస్తీర్ణం ఉందా లేదా అనేది సరిచూసుకోవాలని, క్షేత్రస్థాయికి, వెబ్ ల్యాండ్ కు తేడా ఉంటే ఎంత శాతం ఉందో నమోదు చేయాలన్నారు. తప్పుగా ఉన్న రికార్డు ప్రజలకు అందుబాటులో ఉంచరాదని, సవరించిన రికార్డు మాత్రమే ఉంచాలని సూచించారు. అంతిమ భూ రికార్డు (ఫైనల్ ల్యాండ్ రికార్డ్ ఎఫ్ ఎల్ ఆర్) రూపొందించిన గ్రామాలలో రెవెన్యూ సమస్యలన్నిటిని పరిష్కరించి వివాదం లేని గ్రామం (డిస్ప్యూట్ ఫ్రీ విలేజ్) గా ప్రకటించాలని సూచించారు. రెండవ ఫేజ్ లో ప్రజల సంతృప్తి స్థాయి బాగా పెరిగిందని చెప్పారు. జిల్లా కలెక్టర్ ప్రశాంతి పనితీరును ప్రశంసించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ రీసర్వే డిప్యూటీ తహశీల్దార్లు మూడు రోజులపాటు రీ సర్వే జరుగుతున్న గ్రామంలో ఉండాలని ఆదేశాలు ఇచ్చినట్లు చెప్పారు. గ్రామ కంఠాలను 22ఏ నుంచి తొలగించి ఫ్రీ హెూల్డ్ చేసినట్లు చెప్పారు. నల్లజర్ల, గోపాలపురం, బిక్కవోలు, రాజమండ్రి పట్టణ, గ్రామీణ ప్రాంతాల నుంచి భూ సమస్యలు, పి జి ఆర్ ఎస్ ఫిర్యాదులు అధికంగా వస్తున్నట్లు చెప్పారు. భూ ఆక్రమణలుగా చెబుతున్న వాటిలో అధిక భాగం కుటుంబ వివాదాల్లో, సివిల్ వివాదాల్లో ఉన్న భూములేనని చెప్పారు. నోటీసు ఇవ్వడం లేదన్న ఫిర్యాదుల నేపథ్యంలో, నోటీసు అందచేసినట్టుగా ఇతరుల నుంచి సాక్షి సంతకాలు తీసుకోవాలని ఆదేశించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో డిఆర్వో టి.సీతారామ మూర్తి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎస్.భాస్కర్ రెడ్డి, ఆర్డీవోలు రాణి సుస్మిత, ఆర్.కృష్ణ నాయక్, సర్వే శాఖ సహాయ సంచాలకులు బి.లక్ష్మీ నారాయణ, తహశీల్దార్లు, సర్వే ఇన్స్పెక్టర్లు, కలెక్టర్ కార్యాలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# రాష్ట్ర మంత్రి వాసంశెట్టి సుభాష్ పెంచి పోషిస్తున్న రౌడీయిజాన్ని అరికట్టాలి

## నీ అనుచరులను అదుపులో పెట్టుకో.. మంత్రి సుభాష్ కు దళిత సంఘాల హెచ్చరిక

## ప్రభుత్వం న్యాయం చేయకపోతే ప్రతి దాడులకు దిగుతాం






**అమలాపురం పెన్ పవర్ జూలై 25:** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో జిల్లాకు చెందిన రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అండదండలతో మంత్రి అనుచరులు చేస్తున్న రౌడీయిజాన్ని అరికట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు న్యాయం జరగని పక్షంలో దళితులంతా యాక్షన్ ఫోర్స్ గా మారి ప్రతి దాడులకు దిగుతామని దళితులపై దాడులు చేస్తున్న తన అనుచరులను మంత్రి సుభాష్ అదుపులో పెట్టుకోవాలని హెచ్చరించారు. జిల్లాలో ఈ మధ్యకాలంలో మంత్రి సుభాష్ అనుచరులు దళితులపై చేస్తున్న దాడులకు వ్యతిరేకంగా దోషులను కఠినంగా శిక్షించాలని కోరుతూ దళిత ఐక్యవేదిక ఆధ్వర్యంలో 22 మండలాల దళిత ముఖ్య నాయకుల అత్యవసర సమావేశం శుక్రవారం బుద్ధ విహార్ లో డిబి లోక్ అధ్యక్షతన జరిగింది .ఈ సమావేశంలో పలువురు నాయకులు మాట్లాడుతూ వాసంశెట్టి సుభాష్ మంత్రి అయిన తర్వాత జిల్లాలో మంత్రి అండ చూసుకుని రౌడీయిజం రాజ్యమేలుతుందని, దీనిని అరికట్టాల్సిన రాష్ట్ర మంత్రి సుభాష్ రౌడీలకు వత్తాసు పలకడం సిగ్గుచేటని ఆరోపించారు. తన అనుచర వర్గం దళితులపై దారుణమైన దాడులకు దిగుతుంటే ఖండించాల్సిన మంత్రి అర్థం లేని మాటలు మాట్లాడడం అన్యాయమని అన్నారు. జిల్లాలో మంత్రి అనుచర వర్గం దళితులపై చేస్తున్న దాడులకు మంత్రి సుభాష్ పూర్తి బాధ్యత వహించాలని రాష్ట్ర మంత్రిగా దళితులకు రక్షణ కల్పించే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. దళిత యువకుడు ధోనిపాటి మహేష్ కుమార్ దాడి కేసులో నిందితులందరి రౌడీ షీట్ ఓపెన్ చేసి అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని ఉద్యోగుల పేరుతో నిరుద్యోగులను మోసం చేసిన మంత్రి సుభాష్ కు చెందిన రాయల్ కళాశాల గుర్తింపును రద్దుచేసి కళాశాల ప్రిన్సిపాల్ గుత్తుల విజయకుమార్ పై కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా ఎస్పీ కృష్ణారావు ను కలిసి అంబేద్కర్ కోనసీమ జిల్లాలో దళితులపై దాడులు అరికట్టే విధంగా చర్యలు తీసుకోవాలని నిందితులను కఠినంగా శిక్షించాలని కోరుతూ వినతి పత్రం అందించారు ఈ కార్యక్రమంలో దళిత ఐక్యవేదిక అధ్యక్షులు డిబిలోక్ కన్వీనర్ జంగా బాబురావు కార్యదర్శి ఇసుక పట్ల రఘుబాబు గొల్లపల్లి డేవిడ్ రాజు కోకన్వీనర్ రేవు తిరుపతిరావు గెద్దం సురేష్ బాబు కొంకి రాజమణి పెనుమాల చిట్టిబాబు సాపే బాలరవి ఉండ్రు ఆశీర్వాదం అయితాబత్తుల వెంకట కృష్ణారావు జిత్తుగ సత్యనారాయణ కప్పల శ్రీధర్ నల్లి శ్రీను పాలమూరి మోహన్ బాబు తదితరులు పాల్గొన్నారు.

# ముద్రగడ ఆరోగ్యం కోసం ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు



**కిర్లంపూడి, పెన్ పవర్,జూలై 25 :** మాజీ మంత్రి రాష్ట్ర వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పొలిటికల్ అడ్వైజరీ కమిటీ సభ్యులు ముద్రగడ పద్మనాభం సంపూర్ణ ఆరోగ్యంతో కిర్లంపూడి తిరిగి రావాలని మండల కేంద్రమైన కిర్లంపూడి మదీనా జామియా మసీదులో ముస్లిం సోదరులు శుక్రవారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ముస్లిం సోదరులు మాట్లాడుతూ తమ అభిమాన నాయకుడు మాజీమంత్రి ముద్రగడ పద్మనాభం ఇటీవల అనారోగ్యానికి గురికావడం ఎంతో ఆందోళన గురయ్యామన్నారు. హైదరాబాద్ యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుచున్న ముద్రగడ మెరుగైన వైద్య సేవలు అందిపుచ్చుకుని సంపూర్ణ ఆరోగ్యంగా తిరిగి రావాలని మసీదులో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మసీద్ కమిటీ ప్రెసిడెంట్ మహ మ్మద్ షాబుద్దీన్, కోశాధికారి షేక్ కాలేషా, గౌరవ అధ్యక్షులు షేక్ ఇబ్రహీం,ఎండి ఖయ్యుం భాషా, షేక్ బషీర్, మసీదు గురువు షంశుల్ హాక్, కాకినాడ మసీద్ గురువు రజాక్, అదిక సంఖ్యలో ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

# విలీన మండలాలతో ప్రత్యేక జిల్లా ఏర్పాటు చేయాలి





## ఏజెన్సీ ప్రాంతంలోని సమస్యలపై దృష్టి సారించండి

- పాడేరు జిల్లా కేంద్రంగా ఎన్నో సమస్యలు ఎదుర్కొంటున్నాం
- మంత్రులను మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేసిన టిడిపి నాయకులు
- టిడిపి అరకు పార్లమెంట్ కార్యదర్శి ముువ్వ శ్రీనివాస్
- ఎటపాక వైస్ ఎంపీపీ దొంతు మంగేశ్వరరావు

**ఎటపాక, పెన్ పవర్, జూలై 25:** తూర్పు ఏజెన్సీ ప్రాంతంలోని విలీన మండలాలతో ప్రత్యేక జిల్లా ఏర్పాటు చేయాలని కోరుతూ టిడిపి అరకు పార్లమెంట్ కార్యదర్శి ముువ్వా శ్రీనివాస్ , ఎటపాక వైస్ ఎంపీపీ దొంతు మంగేశ్వరరావు నేతృత్వంలో తెలుగు తమ్ముళ్లు శుక్రవారం పలువురు మంత్రులను వెలగపూడిలోని రాష్ట్ర సచివాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత , రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ , జిల్లా ఇన్చార్జి మంత్రి గుమ్మడి సంధ్యారాణి , టిడిపి అధికార ప్రతినిధి టిడి.జనార్ధన్ లను కలిసి ఏజెన్సీ ప్రాంత సమస్యలు వివరించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన అనంతరం విలీన మండలాలైన ఎటపాక , కూనవరం, చింతూరు , విఆర్.పురం మండలాలను పరిపాలనా సౌలభ్యం కోసం తూర్పుగోదావరి జిల్లాలో విలీనం చేశారని పేర్కొన్నారు. విలీన మండలాల ప్రజలు తమ తమ సమస్యలపై కాకినాడ జిల్లా కేంద్రానికి వెళ్లాలంటే 250 కిలోమీటర్ల మేర ప్రయాణించాల్సి వచ్చేది. తరువాత కాలంలో వైసీపీ ప్రభుత్వం అల్లూరి సీతారామరాజు జిల్లాగా నూతన జిల్లా ఏర్పాటు చేసి పాడేరు జిల్లా కేంద్రంగా ప్రకటించి ఆయా మండలాలను అందులో విలీనం చేసింది. ఈ నేపథ్యంలో ప్రజలు జిల్లా కేంద్రమైన పాడేరు వెళ్లాలంటే 350 కిలోమీటర్ల మేర ఎన్నో వ్యయప్రయాసలతో వెళ్లాల్సి రావడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 2022 సంవత్సరంలో విలీన మండలాల్లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటించి విలీన మండలాలను ప్రత్యేక జిల్లాగా ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. కాబట్టి విలీన మండలాల ప్రజల సమస్యలను గుర్తించి ప్రత్యేక జిల్లాగా ఏర్పాటు చేస్తే ప్రజలకు ఇబ్బందులు తప్పుతాయన్నారు. అంతేకాకుండా ఏజెన్సీ ప్రాంతంలో ప్రభుత్వం మౌలిక వసతుల కల్పనలో భాగంగా అంతర్గత రహదారులు , మంచినీటి సౌకర్యం , విద్యుత్ సరఫరా ఇతరత్రా సమస్యలపై కూడా దృష్టి సారించి తక్షణమే పరిష్కరించాలని కోరారు. దాంతో ప్రత్యేక జిల్లా కేంద్రం ఏర్పాటు , ఏజెన్సీ ప్రాంత సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని మంత్రులు హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఆయా మంత్రులను కలిసిన వారిలో ఎటపాక సొసైటీ ప్రెసిడెంట్ మాచినేని రాజేష్ , మాజీ వైస్ ఎంపీపీ రావి మాధవరావు , అరకు పార్లమెంట్ కార్యదర్శి పెనుబల్లి సాయిబాబు , రైతు అధికార ప్రతినిధి చంద్ర రఘుబాబు , పసుపులేటి రాంబాబు , తదితరులు పాల్గొన్నారు.



# భారీ తుఫాన్‌తో దరికి చేరిన సోనా బోట్లు

**అమలాపురం పెన్ పవర్, జూలై 25:** డా బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, సఖినేటిపల్లి మండలం అంతర్వేది పల్లిపాలెం మినీ ఫిషింగ్ హార్బర్‌లో భారీ తుఫాన్ కారణంగా కొన్ని సోనా బోట్లు పల్లిపాలెం మినీ ఫిషింగ్ హార్బర్‌కు చేరుకొన్నాయి. వారు స్థానికులతో మాట్లాడుచూ సముద్రం ఉగ్రరూపం చూపిస్తున్నదని, మాటలు వర్ణనతీతమని, ప్రాణాలతో దారికి చేరుకొన్నామని తెలిపారు. సుమారు 5 బోట్లు వరకు అంతర్వేది పల్లిపాలెం ఫిషింగ్ హార్బర్ కు చేరుకొన్నారని స్థానికులు చెబుతున్నారు.

# సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ...




**అమలాపురం/ పెన్ పవర్, జూలై 25:** అంబేద్కర్ కోనసీమ జిల్లా, మలికిపురం మండలం శాసనసభ్యుల వారి క్యాంపు కార్యాలయము విశ్వేశ్వరాయపురం నందు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా రాజోలు నియోజకవర్గం లోని 30 మంది లబ్ధిదారులకు మంజూరు కాబడిన రూ. 32,06,271 విలువ గల చెక్కులను శాసనసభ్యులు దేవ వర ప్రసాద్ చేతుల మీదగా బాధిత కుటుంబాలకు అందచేశారు.శాసన సభ్యులు దేవ మాట్లాడుతూ సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా అనేక మంది బాధితులకు సహకారం అందుతుందని, ఇప్పటివరకు 375 బాధిత కుటుంబాలకు 3 కోట్ల 38 లక్షల మొత్తాన్ని అందచేయడవైనదని తెలిపారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో మార్క్ ఫేడ్ డైరక్టర్ జి నరసింహరావు, ఏం నాని, ఎన్డీఏ కూటమి నాయకులు, లబ్దిదారులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# వాడపల్లి దేవస్థాన అభివృద్ధి పనులను పరిశీలించిన ఆలయ అధికారి ఎన్.ఎస్.చక్రధర్ రావు





**ఆత్రేయపురం పెన్ పవర్ జూలై 25:** కోనసీమ తిరుమలగా ప్రసిద్ధి చెందిన వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానం అభివృద్ధి పనులను ఆలయ డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావు శుక్రవారం పరిశీలించారు. భక్తుల సౌకర్యార్థంగా చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో నిర్మాణంలో ఉన్న కంపార్ట్మెంట్లు, క్యూ కాంప్లెక్స్, క్యూలైన్ల వద్ద టాయిలెట్లు, ఫ్యాన్లు, కూలర్లు వంటి ఏర్పాట్లను పరిశీలించారు. భక్తుల రద్దీ నేపథ్యంలో మరిన్ని నూతన ఫ్యాన్లు, కూలర్లు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. రావులపాలెం వద్ద నిర్మాణంలో ఉన్న స్వాగత తోరణం (ఆర్చ్ గేట్) పనుల పురోగతిని కూడా ఆయన పరిశీలించారు. భక్తులకు అత్యవసర వైద్య సహాయం అవసరమయ్యే పరిస్థితుల్లో, మెడికల్ క్యాంపులో అదనంగా బెడ్లు అందుబాటులో ఉంచినట్లు డిప్యూటీ కమిషనర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఇంజినీర్ ఉదయ్ కుమార్, ముదునూరి వెంకట రాజు తదితర అధికారులు పాల్గొన్నారు.

# ఏకలవ్య పాఠశాలలో మౌలిక సదుపాయాల కొరత

## తాగునీరు, రహదారి, మురుగునీటి సమస్యలపై జిల్లా కలెక్టర్‌కి వినతి

## తల్లిదండ్రులు, విద్యార్థులు ఎదుర్కొంటున్న అవస్థలు వెలికి తీసిన గొల్లపూడి పెద్దిరాజు



**రాజవొమ్మంగి, పెన్ పవర్ జూలై 25:** రాజవొమ్మంగి మండలంలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో విద్యార్థులు మౌలిక సదుపాయాల లేక తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని, సమస్యలపై తక్షణ చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌కి వినతిపత్రం అందజేశారని గొల్లపూడి పెద్దిరాజు తెలిపారు.పాఠశాలలో తాగునీటి సౌకర్యం పూర్తిగా లోపించిందని, ప్రస్తుతం అందుబాటులో ఉన్న నీరు శుద్ధం కానిది కావడంతో విద్యార్థులు అనారోగ్యానికి గురయ్యే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. గత కొన్ని రోజులుగా విద్యార్థుల్లో జ్వరం, వాంతులు, అలసట వంటి లక్షణాలు కనిపిస్తున్నాయని, తాగునీరు విషయంలో ప్రభుత్వం తక్షణంగా జోక్యం చేసుకుని శుద్ధినీటి ప్లాంట్ ఏర్పాటు చేయాలని కోరారు. తాగునీటి సమస్యతో పాటు, రహదారి సదుపాయం లేకపోవడమూ మరొక ప్రధాన సమస్యగా ఉందన్నారు. రాజవొమ్మంగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి ఏకలవ్య పాఠశాల వరకు వెళ్లే దారి పూర్తిగా గుంతలతో నిండిపోయి, వర్షాకాలంలో నిలిచిన నీరు, మట్టిబారిన రహదారి వల్ల విద్యార్థులు, తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. పాఠశాలకు వెళ్లే తల్లిదండ్రులు బస్సు దిగి నడిచే దారిలో బురద, నీరు చేరడంతో చిరాకు చెంది, అసహనంతో మాటల పరిమితి మరిచే స్థితికి చేరుతున్నారని పేర్కొన్నారు.ఇంతటి అనారోగ్య వాతావరణంలో చిన్న చిన్న పిల్లలు దూర ప్రాంతాల నుంచి వచ్చి చదువుకోవాల్సి రావడం ఆందోళన కలిగిస్తోందని, తల్లిదండ్రులెవరూ కూడా సంతోషంగా పిల్లలను అక్కడ వదిలిపెట్టే పరిస్థితి లేదన్నారు. పిల్లల కోసం తగిన వసతులు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉన్నదని, విద్యార్థుల భద్రత, ఆరోగ్యం కోసమే ఈ వినతిపత్రం కలెక్టర్‌కి అందజేశానని గొల్లపూడి పెద్దిరాజు తెలిపారు. అంతేకాక, పాఠశాల ప్రాంగణంలో మురుగునీటి వ్యవస్థ లేకపోవడంతో మురుగు నీరు పక్కనే ఉన్న వ్యవసాయ పొలాల్లోకి ప్రవహించి పంటల నష్టానికి దారి తీస్తోందని, దుర్వాసన వల్ల గ్రామ ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని ఆయన చెప్పారు. డ్రైనేజీ నిర్మాణం చేయలేనిపక్షంలో కనీసం ఇంకుడు గుంటలు ఏర్పాటు చేయాలని సూచించారు.ఈ సమస్యలన్నింటిపై అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని, విద్యార్థుల సురక్షిత వాతావరణం కోసం ప్రభుత్వం ముందడుగు వేయాలని గొల్లపూడి పెద్దిరాజు జిల్లా కలెక్టర్‌ను కోరారు.

## ర్యాలి గ్రామ శివారులో గంజాయితో ఉన్న వ్యక్తి అరెస్ట్



ఆత్రేయపురం,పెన్ పవర్ జూలై 25: డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయ పురం మండలం ర్యాలి గ్రామ శివారులో గంజాయి కలిగి ఉన్నట్టు అందిన విశ్వసనీయ సమాచారంతో అధికారులు దాడులు నిర్వహించారు. ఆత్రేయపురం ఎస్ఐ ఎస్. రాము ఆధ్వర్యంలో పోలీస్ బృందం, డిప్యూటీ తహసీల్దార్ సిబ్బంది సహకారంతో జరిగిన ఈ ప్రత్యేక రైడ్‌లో పువ్వుల మణి కంఠను అదుపులోకి తీసుకున్నారు. జరిపిన తనిఖీల్లో సుమారు 470 గ్రాముల గంజాయిను స్వాధీనం చేసుకున్నారు.ఇది మధ్యవర్తుల సమక్షంలో జరిగిందని అధికారులు తెలిపారు. అనంతరం ఆ వ్యక్తిపై సంబంధిత న్యాయపరమైన సెక్షన్ల కింద కేసు నమోదు చేసి, దర్యాప్తు ప్రారంభించారు. పోలీసులు గంజాయి వంటి మాదక ద్రవ్యాల అక్రమ నిల్వలు, రవాణాపై నిఘా మరింత కట్టుదిట్టం చేస్తున్నట్టు వెల్లడించారు. ప్రజల సహకారంతో ఇలాంటి అక్రమ చర్యలకు అడ్డుకట్ట వేస్తామని తెలిపారు.

## డిజిటల్ ఇండియా వేదికగా సాంకేతిక విప్లవం

### బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కోన



మండపేట. పెన్ పవర్.జూలై 25: దేశాన్ని సాంకే తికంగా అభివృద్ధి పథంలో నడిపించిన డిజిటల్ ఇండియా కార్యక్రమం ప్రారంభించి దశాబ్దం పూర్తయ్యిందని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కోన సత్యనారాయణ పేర్కొన్నారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ 2015 జూలైలో ప్రారంభించిన ఈ కార్యక్రమం దేశవ్యాప్తంగా విద్య, వైద్య, వ్యవసాయం, బ్యాంకింగ్, వ్యాపార రంగాలలో విప్లవాత్మక మా ర్పులు తీసుకువచ్చిందన్నారు. నగదు రహిత లావాదేవీలకు బాటలు వేసి, నల్లధన వినియో గానికి అడ్డుకట్ట వేసిందని తెలిపారు. మారుమూల గ్రామాల నుండి మెట్రో నగరాల వరకు ప్రజలు డిజిటల్ టెక్నాలజీని సులభంగా వినియోగించు కుంటున్నారని అన్నారు. ఎలక్ట్రానిక్స్, కమ్యూని కేషన్ రంగాలలో వచ్చిన ప్రగతితో ప్రభుత్వ పాలన ను డిజిటల్ వేదికగా ప్రజలకు చేరువ చేశార న్నారు. ఇంటర్నెట్ యాక్సెస్, మొబైల్ టెక్నాలజీ ఆధారంగా పాలన రంగాన్ని ప్రజల దృష్టికి తీసుకువచ్చారన్నారు. ప్రతి భారత పౌరుడి దైనందిన జీవితంలో డిజిటల్ ఇండియా భాగంగా మారిందని పేర్కొన్నారు. డిజిటల్ ఇండియా అభియాన్ దేశానికి సాంకేతిక భవిష్యత్తును అందించిందని కొనియాడారు.

## యానాం ఎమ్మెల్యే అశోక్‌ని మర్యాద పూర్వకంగా కలిసిన కంకిపాటి గోపి



అల్లవరం, పెన్ పవర్,జూలై 25: అమలాపురం నియోజవర్గం అల్లవరం సొసైటీ అధ్యక్షులు జనసేన నాయకులు కంకిపాటి గోపాలకృష్ణ (గోపి) పాండిచేరి యానం ఎమ్మెల్యే గొల్లపల్లి అశోక్ ని యానంలో వారి క్యాంప్ కార్యాలయం నందు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్బంగా సొసైటీ అధ్యక్షులుగా ఎన్నికైనందున గోపికి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం సాలువాతో సన్మానం చేసిన యానం ఎమ్మెల్యే గొల్లపల్లి అశోక్ ఆనంతరం భవిష్యత్తులో మరెన్నో పదవులు పొందాలని అభినందించారు.

## ఆరోపణల అవాస్తవం:ఎంఈఓ హనుమ వివరణ



తాడేపల్లిగూడెం, పెన్ పవర్, జులై 25: కొందరు ఉపాధ్యాయులు, ఒక ఉపాధ్యాయ సంఘం నాయకులు తనపై చేస్తున్న ఆరోపణలన్నీ అబద్ధాలేనని తాడేపల్లిగూడెం మండల విద్యాశాఖ అధికారి వి. హనుమ ఖండించారు. ఉపాధ్యాయుల పట్ల అనుచితంగా ప్రవర్తిస్తున్న ఎంఈఓ ను సస్పెండ్ చేయాలని ఎస్టియు నాయకులు శుక్రవారం సాయంత్రం విలేకరుల సమావేశంలో డిమాండ్ చేశారు. దీనిపై ఎంఈఓ హనుమను మీడియా ప్రతినిధులు వివరణ కోరగా పై విధంగా స్పందించారు. తాను మండల విద్యాశాఖ అధికారిగా ప్రభుత్వ ఆదేశాలకు అనుకూలంగా పనిచేస్తున్నానన్నారు. దీనివలన కొంతమందికి ఇబ్బంది కలిగి ఉండవచ్చన్నారు. ఆ కారణంగా తనపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని తిప్పి కొట్టారు. అవన్నీ అబద్దాలని కొట్టి పారేశారు. అయితే ఈ నెల 15వ తేదీ రాత్రి తాను ఒక ఉపాధ్యాయుడితో మాట్లాడిన మాటలు తప్పు అను భావిస్తే తాను కూడా దాని పట్ల విచారం వ్యక్తం చేస్తున్నానన్నారు. తాను కావాలని ఉద్దేశపూర్వకంగా ఎవరిని దూషించలేదని స్పష్టం చేశారు. ఒకవేళ ఎవరికైనా తన వలన ఇబ్బంది కలిగిన, తన మాటలు బాధించిన అన్యధా భావించవద్దని ఎంఈఓ హనుమ కోరారు. ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా ఉత్తమ విద్యా బోధనతో భావి భారత పౌరులను తీర్చిదిద్దాలని తన లక్ష్యమని ఎంఈఓ వి. హనుమ తెలిపారు.

# ఘనంగా కారం తమన్న దొర 145వ వర్ధంతి

### కారం తమన్న దొర జిల్లా ఏర్పాటు చేయాలి

### ఆదివాసీ జేఏసీ డిమాండ్







చింతూరు, పెన్ పవర్, జూలై 25: తొలితరం మన్యం వీరుడు, స్వాతంత్ర్య సమరయోధుడు కారం తమన్న దొర 145వ వర్ధంతిని చింతూరు మండలం నరసింహపురం ఆశ్రమ పాఠశాలలో ఆదివాసీ జేఏసీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జేఏసీ చైర్మన్ జల్లి నరేష్, ఉద్యోగ జేఏసీ నాయకులు తిమ్మా సాయి వెంకటరమణ నేతృత్వం వహించారు. సభను ప్రారంభిస్తూ గ్రామ పూజారి ముచ్చిక సింగయ్య తమన్న దొర చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం ఆదివాసీ నేతలు కారం రంగారావు, ప్రధానోపాధ్యాయులు ఉర్మ వెంకటనారాయణ తమన్న దొర రంపచోడవరం కేంద్రంగా బ్రిటిష్ కాలంలో చేసిన ఉద్యమాలను గుర్తు చేశారు. ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజ శ్రీను మాట్లాడుతూ, తమన్న దొర 1838, 1848 మధ్య కాలంలో బ్రిటీష్ పాలనకు వ్యతిరేకంగా గుండెచాటున తిరుగుబాటును నడిపారు. 1840లో కోయ ముఠాదారులతో కలిసి 12 మంది బ్రిటిష్ పోలీసులను హతమార్చారు, 20 మందికి తీవ్ర గాయాలు చేశారు. వీరుడు కారం తమన్న దొరను చరిత్ర గుర్తించాలి అని అన్నారు. ఆగస్టు 15వ తేదీలోపు తమన్న దొర కుటుంబాలను ప్రభుత్వం గుర్తించి గౌరవించాలి, రంపచోడవరం కేంద్రంగా ఆయన పేరుతో జిల్లా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఏజెన్సీలో నాన్ ట్రైబల్స్ అక్రమ కట్టడాలను వెంటనే తొలగించాలని, లేనిపక్షంలో ప్రజా ప్రయోజన వ్యాజ్యం న్యాయస్థానంలో వేయనున్నట్లు హెచ్చరించారు. హక్కులు కావా లంటే బాధ్యతలు కూడా తీసుకోవాలి అని యువతను చైతన్యం ˊరిచారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు సోడి నారాయణ, తొడం దేశయ్య, సున్నం వెంకటేశ్వర్లు, గొర్రె బిక్షం, కుర్సం పకీర్ దొర, కాకా సీతారామయ్య, కారం చందు, ముచ్చిక బాలకృష్ణ, పొడియం రమేష్, ముచ్చిక వినోద్ కుమార్, కాక నాగేశ్వరరావు, సవలం రవి తదితరులు పాల్గొన్నారు.



## కలెక్టర్ చేతుల మీదుగా కాకినాడ సిటీ ప్రెస్ క్లబ్ లోగో ఆవిష్కరణ

### జర్నలిస్టుల సంక్షేమంపై కలెక్టర్ సానుకూల స్పందన

కాకినాడ, పెన్ పవర్,జూలై 25:కాకినాడ సిటీ ప్రెస్ క్లబ్ రూపొందించిన నూతన "లోగో"ను జిల్లా కలెక్టర్ డా. షాన్మోహన్ సగిలి శుక్రవారం ఆయన ఛాంబరులో ఆవిష్కరిం చారు. ఈ కార్యక్రమం సందర్భంగా ప్రెస్ క్లబ్ ప్రతినిధులతో కలెక్టర్ సుదీర్ఘంగా ముచ్చటించి, వారు చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలను ప్రశంసించారు.ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ సభ్యుల జాబితాను కలెక్టర్‌కు అందజేశారు. ప్రెస్ రంగంలో నకిలీ విలేకరుల సంచారం విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చిన క్లబ్ ప్రతినిధులు, చట్టబద్ధంగా గుర్తింపు ఉన్న విలేకరులకే అన్ని అధికారిక కార్యక్రమాల్లో ప్రాధాన్యం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.జర్నలిస్టుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని చేపడుతున్న కార్యక్రమాలపై కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. విలేకరుల సమస్యల పరిష్కారానికి జిల్లా యంత్రాంగం కృషి చేస్తుందన్న హామీతో ప్రెస్ క్లబ్ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు రెడ్డిపల్లి రాజేష్, కార్యదర్శి దెంకాడ మోహన్ మాట్లాడుతూ.. "133మంది సభ్యులతో కొనసాగుతున్న కాకినాడ సిటీ ప్రెస్ క్లబ్, జర్నలిస్టుల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తోంది. ఇటీవల జర్నలిస్ట్ కుటుంబాల కోసం ఉచిత ఆరోగ్య శిబిరం నిర్వహించాం. కొత్తగా రూపొందించిన లోగోను ప్రతి సభ్యునికి అందించడమే కాకుండా, ప్రభుత్వ కార్యాల యాల్లోనూ గుర్తింపుగా ప్రదర్శించనున్నాం" అని తెలిపారు. త్వరలో మరిన్ని సంక్షేమ కార్యక్రమాలకు కార్యాచరణ రూపొందించామని వెల్లడించారు.కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టు అంజిబాబు, జాయింట్ సెక్రటరీ దడాల ఏడుకొండలు, వీధి గోపీనాథ్, ఆకెళ్ళ శ్రీనివాస్, సురేష్ గుండు శ్రీనివాసరావు, కేసీసీ శ్రీనివాస్, స్వతంత్ర టీవీ శ్రీధర్, సిటీ కేబుల్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.జిల్లా కలెక్టర్ డా. షాన్మోహన్ జర్నలిస్టుల సంక్షేమానికి అండగా నిలవడం, మీడియా వర్గాల్లో విశేష స్పందనకు దారి తీసింది.

## చంద్రబాబు ఓర్పుతో ప్రజాపక్షాన నిలబడుతున్నారు

### టీడీపీ రాష్ట్ర మైనారిటీ సెల్ కార్యదర్శి సల్మాన్ హుస్సేన్



మండపేట. పెన్ పవర్. జూలై 25 : రాష్ట్ర అభివృద్ధి కోసం, భావితరాల భవిష్యత్తు కోసం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్ని రాజకీయ ఒత్తిడులను, ఆరోపణలను ఓర్పుతో భరిస్తున్నారని టీడీపీ రాష్ట్ర మైనారిటీ సెల్ కార్యదర్శి సల్మాన్ హుస్సేన్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపీ ప్రజలు గత ఎన్నికల్లో సైకో పార్టీని ఘోర పరాజయం పాలు చేశారన్నారు. కూటమి పార్టీలను విజయపథంలో నడిపారు. అయినప్పటికీ ఓడిపోయిన సైకో నేతకు కొన్ని కేంద్ర రాజకీయ నాయకుల మద్దతు ఉన్నట్టు ఊహాగానాలు వినిపిస్తున్నాయన్నారు. ఏపీలో ఉన్నతాధికారులు, కొన్ని కేంద్ర అధికార వర్గాలు ఇప్పటికీ ఓడిపోయిన నాయకుడి చెప్పుచేతుల్లో ఉన్నట్లు తెలుస్తోందన్నారు. ప్రభుత్వాధికారులు, సంస్థలు, వనరులపై ఆయనే అధిపత్యం చూపిస్తున్నారని ఆరోపణలున్నాయని వ్యాఖ్యానించారు. ఏపీకి చెందిన ఓ నాయకుడి మీద ఇప్పటికే ఆర్థిక నేరాల కేసులు ఉన్నాయన్నారు. వ్యాపార సంబంధం లేకుండానే అపారంగా సంపద కూడబెట్టిన విషయంపై దేశవ్యాప్తంగా చర్చ జరుగుతోం దని అన్నారు. ఇది రాష్ట్రానికి తీవ్ర నష్టాన్ని కలిగిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. చంద్రబాబు నాయుడు గారు రాష్ట్ర ప్రజల భద్రత, అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని అన్ని అవమానాలను ఓర్పుతో ఎదుర్కొంటున్నారని తెలియజేశారు.

## ప్రమాదాలు పొంచి ఉన్నచోట రేడియం స్టిక్కర్లను ఏర్పాటు చేయాలి



ఎటపాక ,పెన్ పవర్,జూలై 25: అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక మండల పరిధిలోని నెల్లిపాక టు చింతూరు వరకు జాతీయ రహదారి నిర్మాణ పనులు జరుగుతున్న విషయం అందరికీ తెలిసినదే, నిర్మాణ పనులలో కాంట్రాక్టర్ భద్రతా చర్యలు పాటించకుండా వాహనదారులకు ప్రమాదాలు జరిగే విధంగా అసంపూర్తిగా రోడ్డు పనులను చేయడంతో మధ్య మధ్యలో రోడ్డు వేయకపోవడంతో పెద్ద పెద్ద గోతులు ఏర్పడి ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి, ప్రమాదాలు ఎక్కువగా జరిగే చోట రేడియం స్టిక్కర్లను అమర్చకుండా ఉండడంతో వాహనదారులు గోతిలో పడి ప్రమాదాలకు గురై గాయాల పాలవుతున్నారు, రాత్రివేళ సమయంలో గుంతలు కనపడకపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు, ఇకనైనా కాంట్రాక్టర్ మూల మలుపుల వద్ద గోతులు పడ్డ ప్రాంతాలలో రేడియం స్టిక్కర్లు ఏర్పాటు చేయాలని వాహనదారుల డిమాండ్ చేస్తున్నారు, ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి ఇటువంటి ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుకుంటున్నారు.

## హరిహర వీరమల్లు ఒక అద్భుత చిత్రం

### జనసేన ఇన్చార్జ్ తుమ్మలపల్లి రమేష్




జగ్గంపేట, పెన్ పవర్, జూలై 25: హరిహర వీరమల్లు ఒక స్ఫూర్తిదాయక సినిమా అని జగ్గంపేట జనసేన పార్టీ ఇంచార్జ్ తుమ్మలపల్లి రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ నటించిన హిస్టారికల్ మూవీ హరిహర వీరమల్లు గురువారం విడుదలై బ్లాక్ బస్టర్ అయిందన్నారు. సినిమా భారీ విజయం పట్ల హర్షం వ్యక్తం చేశారు. నాటి మొగలుల కాలంలో హిందూ దేవాలయాలపై జరిగిన దాడిని కళ్ళకు కట్టినట్టు చూపించారని, నాడు హిందువులపై వేసిన జిజియా పన్నుల విషయమై ఈ సినిమాలో చూపించారని అన్నారు. అలాగే ఇటువంటి స్ఫూర్తిదాయకమైన హిస్టరీని తెలియజేసేటటువంటి సినిమాని ప్రతి ఒక్కరూ చూసి చరిత్ర తెలుసుకోవాలన్నారు. జగ్గంపేట నియోజకవర్గంలో ఉన్న జనసేన నాయకులు కార్యకర్తలు ఈ యొక్క చిత్ర గొప్పతనాన్ని ప్రజలందరికి తెలియజేసి ప్రతి ఒక్కరు ఈ సినిమా చూసే విధంగా ప్రోత్సహించాలని పేర్కొన్నారు.

## పోలీస్ ఎన్ కౌంటర్ మరణాలపై న్యాయ విచారణ





వై రామవరం,పెన్ పవర్, జులై 25: వై.రామవరం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన పోలీస్ ఎన్ కౌంటర్ మృతులపై మెజిస్టిరియల్ విచారణ నిర్వహించడం జరుగుతుందని రంపచోడవరం సబ్ కలెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు. వై రామవరం స్టేషన్ పరిధిలో మే 7వ తేదీన దుమ్మకొండ, గంగ కొండ అటవీ ప్రాంతంలో శేషరాయి గ్రామ సమీపంలో ఎన్ కౌంటర్ జరిగిందని అన్నారు. ఈ ఎన్ కౌంటర్ లో కాకూరి పండన్న అలియాస్ జగనన్న అలియాస్ బిరుసు మరియు వాగా పొడియం అలియాస్ రమేష్ అలియాస్ నాగన్న మరణించారని తెలిపారు. వీరి మరణాలపై ఈనెల 28వ తేదీన రంపచోడవరం సబ్ కలెక్టర్ ఆఫీసులో న్యాయ విచారణ జరుగుతుందని తెలిపారు. మరణించిన వ్యక్తుల యొక్క కుటుంబ సభ్యులు గానీ, సహచరులు గాని ఏ విధమైన సాక్షాలు ఉన్న విచారణకు హాజరు కావాలని అన్నారు. ఈ విచారణకు పోలీస్ అధికారులు, పోస్ట్ మార్టం నిర్వహించిన వైద్యాధికారి హాజరవుతారని నోటీసులో పేర్కొన్నారు.

# ఏలేరు ఆయకట్టు రైతాంగం నిశ్చింతగా వ్యవసాయం చేసుకోవచ్చు





## జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ

**జగ్గంపేట, పెన్ పవర్, జూలై 25:** ఏలేరు ఆయకట్టు రైతాంగం నిశ్చింతగా వ్యవసాయం చేసుకోవచ్చని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. శుక్రవారం జగ్గంపేట మండలం రామవరం గ్రామంలో పురుషోత్తపట్నం ఫేజ్ 2 ద్వారా ఏలేరుకు నీటిని విడుదల చేసే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ, పిఠాపురం జనసేన ఇన్చార్జి మర్రెడ్డి శ్రీనివాస్ హాజరయ్యారు. ముందుగా వారు పురుషోత్తపట్నం ఫేజ్2 వద్ద ప్రత్యేక పూజలు చేసి మోటార్లు స్విచ్ ఆన్ చేసి ప్రారంభించారు. ఈసందర్భంగా గోదావరి జలాలకు పూజలు చేసి హారతులు పట్టారు. అనంతరం జగ్గంపేట ఎమ్మెల్యే నెహ్రూ విలేకరులతో మాట్లాడారు. ఏలేరు రిజర్వాయర్ లో ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా నీటి సామర్థ్యం పది టీఎంసీలకు లోబడి ఉందన్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే ఆయకట్టు పంటలకు ఇబ్బంది కలిగే అవకాశమున్న దృష్ట్యా పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించాలని ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చిందన్నారు. దీనిలో భాగంగానే రామవరంలో ఫేజ్ 2 ద్వారా నీటిని విడుదల చేశామన్నారు. గత రెండు రోజుల క్రితం వరకు ఏలేరు ప్రాజెక్టుకు 500 క్యూసెక్కులు ఇన్ ఫ్లో రాగా ఏజెన్సీలో పడ్డ వర్షాల వల్ల ప్రస్తుతం 2200 ఇన్ ఫ్లో వస్తుందన్నారు. ఇప్పటికే ఆయకట్టు పరిధిలో రైతులు నాట్లు మొదలు పెట్టారన్నారు. గత పది రోజుల నుంచి కిందకి 900 క్యూసెక్కుల నీరు వదులుతున్నారన్నారు. ప్రస్తుతం నీరు సరిపోయే పరిస్థితి ఉన్నప్పటికీ 1200 క్యూసెక్కుల నీరు కిందికి వదిలితే కాని పూర్తిస్థాయిలో చివరి పంటకు నీరు చేరే పరిస్థితి ఉండదన్నారు. అయితే ఏలేరు బెడ్ లెవల్ పెంచి సమాన స్థాయిలోకి తేవాలని, 67వేల ఎకరాల ఆయకట్టుకు ఆరు టీఎంసీల నీరు సరిపోయే పరిస్థితి ఉన్నప్పటికీ 12 నుంచి 15 టీఎంసీల నీరు కిందకి పంపాల్సి ఉందన్నారు. ఏలేరు బెడ్ లెవల్ పెంచి కాలువలు పునః నిర్మాణం చేసి సక్రమంగా రెండు పంటలకు నీరందించే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. వీలైనంత వరకు ఏలేరు నీటితోనే సరిపోయేలా ప్రయత్నం చేస్తామని అనావృష్టి పరిస్థితులు వస్తే ఖచ్చితంగా పురుషోత్తపట్నం గోదావరి నుంచి ఐదారు టీఎంసీల నీరు తెచ్చుకుని ఏలేరు, తిమ్మరాజు చెరువు ఆయకట్టు పరిధిలో పంటలు పాడవకుండా చూసుకునే బాధ్యత కూటమి ప్రభుత్వం తీసుకుంటుందన్నారు. పంటలకు నీరు ఎక్కడ తక్కువవుతుందోననే భయంతో అవసరం కాకపోయిన పురుషోత్తపట్నం ఫేజ్2 ద్వారా నీరు విడుదల చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్వీఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, ఏలేరు ప్రాజెక్టు కమిటీ చైర్మన్ బస్వా వీరబాబు, కొత్త కొండబాబు, టీడీపీ రాష్ట్ర తెలుగు యువత ఉపాధ్యక్షులు అడబాల వెంకటేశ్వరరావు, ప్రత్తిపాడు జనసేన నాయకుడు కత్తిపూడి బాబి, ఈఈ డి.శ్రీనివాసులు, డీఈఈ వి.ప్రసాదరావు, ఏఈఈలు ఎస్.ఉమాదేవి, ఎస్.నవీన్ సంతోష్, పి.రజనీకాంత్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

# కామ్రేడ్ శాగంటి రాజారావు ఆశయసాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలి

**జగ్గంపేట, పెన్ పవర్, జూలై 25:** కామ్రేడ్ శాగంటి రాజారావు ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా సహాయ కార్యదర్శి చీకట్ల వెంకటేశ్వరరావు అన్నారు. జగ్గంపేటలో శుక్రవారం స్టాలిన్ భవనం లో కామ్రేడ్ శాగంటి రాజారావు 4వ వర్ధంతి సభ నిర్వహించారు. ముందుగా స్టాలిన్ భవన్ నుండి ర్యాలీ జేవియర్, ఆర్టీసీ కాంప్లెక్స్, కాకినాడ మెయిన్ రోడ్డు మీదుగా అరుణోదయ కళాకారులతో ర్యాలీ నిర్వహించారు. జగ్గంపేట స్టాలిన్ భవన్లో సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ పెద్దాపురం డివిజన్ కార్యదర్శి వి.చిట్టిబాబు ఆధ్వర్యంలో సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ రాష్ట్ర కమిటీ సభ్యుడు, అఖిల భారత రైతూ కూలి సంగమ్ (ఏఐకేఎంఎస్) రాష్ట్ర అధ్యక్షులు, వృత్తి విప్లవ కారుడు ప్రతిఘటన పోరాట యోధుడు కామ్రేడ్ యస్.రాజారావు 4వ వర్ధంతి సందర్భంగా అధ్యషణ సభ ఘనంగా నిర్వహించారు. స్టాలిన్ భవన్ లోని స్థూపం వద్ద వద్దఆయన చిత్రపటానికి పూల మాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా సహాయ కార్యదర్శి చీకట్ల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఈ సమాజాన్ని సామ్రాజవదులు, పెట్టుబడిదారులు, ఈ దేశాన్ని,




ప్రజలను దొసుకున్నంత వరకు, ఆకలి బాధలు ఉన్నంత వరకు ప్రజాపోరాటాలు వుంటాయన్నారు. ఈ కార్యక్రమం లో ఏఐకేఎంఎస్ రాష్ట్ర కమిటీ సభ్యురాలు యస్.లక్ష్మి, పి ఓ డబ్ల్యు జిల్లా అధ్యక్షులు పి.విజయ, ఏఐకేఎంఎస్ డివిజన్ కమిటీ సభ్యులు కె.బాబు రావు, ఎన్.వరద రాజు, బిల్డింగ్స్ వర్క్స్ యూనియన్ స్టేట్ కమిటీ సభ్యులు కారుకొండ శ్రీను, మొరుకుర్తి రాజు, అరునోదయ ధర్మ రెడ్డి, సుగ్గిరెడ్డి, పిడిఎస్ యూ డివిజన్ అధ్యక్షులు వి.మయూరి తదితరులు పాల్గున్నారు.

# బీజేపీ కోనసీమ జిల్లా ప్రధాన కార్యదర్శిగా సలాది వీరబాబు నియామకం

## ఉపాధ్యక్షురాలిగా కొప్పన లక్ష్మి, కార్యవర్గ సభ్యులుగా పైడికొండల రామకృష్ణ ఎంపిక

**కాజులూరు, పెన్ పవర్,జూలై 25:** భారతీయ జనతా పార్టీ (బీజేపీ)లో కోనసీమ జిల్లాలో కీలక నియామకాలు జరిగాయి. పార్టీ సేవా కృషికి గుర్తింపుగా కాజులూరు మండలానికి చెందిన సలాది వీరబాబుని బీజేపీ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమిస్తూ పార్టీ నాయకత్వం నిర్ణయం తీసుకుంది.

**సలాది వీరబాబు:** నిబద్ధతకు గుర్తింపుగా పెద్ద పదవి సలాది వీంబాబు 2012లో ఆర్ఎస్ఎస్ సేవకునిగా తన రాజకీయ ప్రయాణాన్ని ప్రారంభించి, 2014లో బీజేపీలో చేరారు. అనంతరం మండల ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టిన వీరు 2019లో కాజులూరు బీజేపీ మండల అధ్యక్షులుగా పనిచేశారు. ఆరు సంవత్సరాల పాటు అహర్నిశలూ పార్టీ సేవలో నిమగ్నమై, అనేక కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించారు. వీరబాబు నియామకాన్ని పార్టీ శ్రేణులు స్వాగతిస్తూ, "పార్టీలో కష్టపడే వారికి గుర్తింపు తప్పకుండా లభిస్తుంది. వీరబాబు పార్టీ బలోపేతానికి తగిన నేత" అని మండల బీజేపీ అధ్యక్షులు పుణ్యమంతుల శివాజీ, ఇళ్ల వెంకటేశ్వరరావు అభిప్రాయ పడ్డారు.

**బీజేపీ జిల్లా ఉపాధ్యక్షురాలిగా కొప్పన లక్ష్మి**

జగన్నాథగిరి ఎంపీటీసీగా ఉన్న కొప్పన లక్ష్మి గారిని బీజేపీ కోనసీమ జిల్లా ఉపాధ్యక్షురాలిగా నియమించింది. ఆమె పార్టీకి



సలాది వీరబాబు



కొప్పన లక్ష్మి



పైడికొండల రామకృష్ణ

చేసిన సేవలు, బలమైన నియోజకవర్గ స్థాయి కడుపుని దృష్టిలో ఉంచుకుని ఈ అవకాశం లభించిందని పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. ఆమె నియామకాన్ని పలువురు సభ్యులు అభినందించారు.

**జిల్లా కార్యవర్గ సభ్యులుగా పైడికొండల రామకృష్ణ**

కాజులూరు మండలానికి చెందిన పైడికొండల రామకృష్ణ గారిని జిల్లా కార్యవర్గ సభ్యులుగా పార్టీ నియమించింది. ఈ నియామకాన్ని మండల బీజేపీ టీం సభ్యులు సంతోషంగా స్వీకరించారు. ఈ సందర్భంగా నూతనంగా నియమితులైన నాయకులు రాష్ట్ర బీజేపీ అధ్యక్షులు ధర్మాన మాధవ్, జాతీయ కార్యవర్గ సభ్యులు ఎమ్మెల్సీ సోము వీర్రాజు, రాష్ట్ర ఉపాధ్యక్షులు మానేపల్లి అయ్యాజీ వేమా, జాతీయ కిసాన్ మోర్చా సభ్యులు నల్లా పవన్, జిల్లా ఇన్చార్జి పొట్లూరి రామ్మోహన్, అనకాపల్లి జిల్లా ఇన్చార్జి కర్రి చిట్టిబాబు, కోనసీమ జిల్లా బీజేపీ అధ్యక్షులు అడబాల సత్యనారాయణ తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు. ఇలా కష్టపడే కార్యకర్తలకు పార్టీ మరింత బలం చేకూర్చే విధంగా ముందుకు నడుస్తుండటం కార్యకర్తల్లో ఉత్సాహం నింపుతోంది.

# వరి పండించే రైతులకు పంట భీమా



**కూనవరం,పెన్ పవర్,జూలై 25.** ప్రధానమంత్రి ఫైసల్ బీమా యోజన పథకం ద్వారా రైతులు 2025 ఖరీఫ్ సీజన్ కు బీమా చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి సిహెచ్ దేవీ తెలిపారు. ఎకరానికి 646 రూ ప్రీమియం భీమా మొత్తం 42,000వేలు ఎస్ బి ఐ జనరల్ ఇన్సూరెన్స్ కో లిమిటెడ్ కి బ్యాంకులో గాని సి ఎస్ సి సెంటర్ ద్వారా,పోస్ట్ ఆఫీస్ ద్వారా గాని జాతీయ పంటల భీమా పోర్టల్ ఎన్ సిఐపి ద్వారా ప్రీమియం పొందవచ్చునని అన్నారు.ఆధార్ కార్డు,భూమి పాస్ పుస్తకం,బ్యాంకు పాస్ బుక్,పంట విస్తరణ సాగు ధ్రువీకరణ పత్రం,ఫోన్ నెంబర్ మొదలైన డాకుమెంట్స్ అవసరమని ఆగష్టు 15లోగా రైతులందరు పైన చెప్పిన డాక్యుమెంట్స్ తో పంట భీమా చేయించుకోవాలని తెలిపారు.





# పెద్దమనసుతో ప్రజలకు అండగా ఎంపీ సానా సతీష్బాబు

**కాకినాడలో 15వ ప్రజాదర్బార్‌లో అర్జిదారులకు తక్షణ స్పందన**

**వీల్‌చైర్లతో అనాధలకు జీవనవెన్నెముక**

**ప్రజల హృదయాలు గెలుచుకున్న స్పందన**

**కాకినాడ స్టాఫ్ రిపోర్టర్, పెన్ పవర్,జూలై 25 :** ప్రజల కోసం ప్రతీ నెలా సమస్యలు వింటూ, వాటికి వెంటనే పరిష్కారాలు చూపిస్తున్న రాజ్యసభ సభ్యుడు సానా సతీష్బాబు మరోసారి తన సామాజిక బాధ్యతను చాటుకున్నారు. నేడు కొప్పవరంలోని ఎంపీ కార్యాలయంలో నిర్వహించిన 15వ ప్రజా దర్బార్‌లో, ఆయన నైతిక చాతుర్యంతో, మానవీయతతో స్పందించిన తీరు అందరినీ ఆకట్టుకుంది. ఈ ప్రజాదర్బార్‌కు విచ్చేసిన రెండు విభిన్న ప్రతిభావంతులు, తమకు వీల్‌చైర్లు అవసరమని అర్జీలుసమర్పించారు. వెంటనే స్పందించిన ఎంపీ సానా సతీష్బాబు గారి సన్నిహిత సహాయక ుడు గౌరీశంకర్, వయోవృద్ధులు మరియు విభిన్న ప్రతిభావంతుల సంక్షేమశాఖ అధికారిని ఫోన్‌లో సంప్రదించి, తక్షణ చర్యల కోసం కృషి చేశారు. ఆ అధికారుల సూచనల మేరకు అర్జిదారులను వారి కుటుంబా లతో కలిసి సొంత వాహనాల్లో సాంబమూర్తి నగర్‌లోని విభిన్న ప్రతిభావంతుల శాఖ కార్యాల యానికి తీసుకెళ్లా రు. అక్కడ ఉప సంచాలకులు శ్రీనివాస్,ఇంచార్జ్ మేకా లక్ష్మణమూర్తి, సానా సతీష్బాబు ఫౌండేషన్ చైర్మన్ తలాటం హరీష్ చేతుల మీదుగా రెండు వీల్‌చైర్లు అందించారు. ప్రజల హృద యాలు గెలుచుకున్న స్పందన. ఈ సందర్భంలో ఎంపీ సానా సతీష్బాబు సూచించిన తీరు, ప్రజా దర్బార్లో వచ్చే అర్జీలపై తక్షణ స్పందన, సంబంధిత శాఖలతో సమన్వయం అన్నీ కలిసొచ్చి ఒక మానవీయ ప్రక్రియకు రూపకల్పన చేశారు. ఈ నిబద్ధతను చూసి అర్జిదారులు, వారి కుటుంబ సభ్యులు మరియు ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఎంపీ కార్యాలయ సిబ్బంది వేగవంతమైన స్పందనకు ప్రశంసల జల్లు కురిసింది. ప్రజా దర్బార్ ఓ వేదిక మాత్రమే కాదు–అది బాధితులకు భరోసా, సహాయా ర్థుల కోసం చేయూత, నాయకత్వానికి నైతికత అని మరోసారి ఎంపీ సానా సతీష్బాబు నిరూపించారు.



# ఐదు వేలు ఖరీదైన నిత్యావసర సరకులు అందజేత

## పాస్టర్,ఉంగుటూరి యేసురత్నం సంఘం సభ్యులు

## టిడిపి మండల నాయకులు,ఆశావర్కర్,అలివేలు

**వి.ఆర్.పురం పెన్.పవర్.జూలై.25:** మండలంలోని వడ్డిగూడెం గ్రామానికి చెందిన కోట్ల రాముడు వయస్సు నలపై సంవత్సరాలు ఇటీవల మృతి చెందడం జరిగింది. మృతి చెందిన కోట్ల రాముడుకు భార్య రజిని ముగ్గురు పిల్లలు ఉన్నారు. కోట్ల రజిని నిరుపేద కుటుంబం కావడంతో ఆ కుటుంబానికి ఆర్థికం సహాయం చేయాలని,మంచి ఉద్దేశంతో వి.ఆర్.పు రం బి.సి.కాలనీ పాస్టర్,ఉంగుటూరి యేసు రత్నం,తల్లి ఆశా వర్కర్,అలి వేలు శుక్ర వారం టిడిపి మండల నాయకులు ద్వారా ఐదు వేల రూ పాయలు ఖరీదైనా నిత్యావసర సరుకులుఆ కుటుంబానికి అందజేశారు. మృతి చెందిన కోట్ల రాముడు కుటుంబ స భ్యులు పాస్టర్,యేసురత్నం కు ఆశా వర్కర్, అలివేలుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మా జీ జడ్పీటీసీ ముత్యాల రామారావు,జడ్పీటీసీ రంగారె డ్డి,సొసైటీ మాజీ అధ్యక్షులు ముత్యాల చంద్రశేఖర్,టిడిపి నాయకులు సూర్య ప్రకాశరావు,రాష్ట్ర తెలుగు యువత నాయకులు బొర్రా నరేష్,బి.సి.కాలనీ సంఘం సభ్యులు గెడ్డం శ్రీను,ముయ్యేటి మదు,ముయ్యేటి కృష్ణ,గుడేటి శాంత కుమారి,ఇందిరమ్మ,తదితరులు పాల్గొన్నారు.

# మహిళలు చిన్నారుల భద్రతలపై అవగాహన

## ఎస్.ఐ.సంతోష్, కుమార్, పోలీసు సిబ్బంది

## మినీ గురుకులం పాఠశాల ఉపాధ్యాయులు




**వి.ఆర్.పురం పెన్.పవర్.జూలై.25** మండలంలోని రేఖపల్లి మినీ గురుకులం పాఠశాల ప్రాగణంలో శుక్రవారం వి.ఆర్.పురం ఎస్.ఐ.సంతోష్, కుమార్,మహిళలు చిన్నారుల భద్రత పై విద్యార్థినులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వి.ఆర్.పురం ఎస్.ఐ.సంతోష్,,కుమార్,మాట్లాడుతూ మహిళలు చిన్నారుల భద్రతల పై లక్ష్యంతో పోలీసు శాఖ సఖి పేరుతో ఒక ప్రత్యేక చైతన్య కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని,పెరుగుతున్న నేరాల పట్ల ప్రజలను ముఖ్యంగా మహిళలను యువతను అప్రమత్తం చేయడమే ముఖ్య ఉద్దేశం మని,అన్నారు. ప్రతి మహిళ తమ స్మార్ట్ ఫోన్‌లో పోలీసు సఖి యాప్ ఇన్‌స్టాలేషన్,చేసుకోవాలని,ఈ యాప్ ద్వారా ఈవ్ టీజింగ్,వంటి వేధింపులకు గురైనప్పుడు కేవలం ఒక్క బటన్ నొక్కితే చాలు,పోలీసు కంట్రోల్ రూమ్‌కు తక్షణమే సమాచారం అందుతుందని,తెలి పారు. బాల్య వివాహాలు మూఢ నమ్మకాలు పై పూర్తిగా నిర్మూలించేందుకు తగు చర్యలు తీసు కుంటామని, హెచ్చరించారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరిగి నట్లయితే సమాచారం మాకు తెలియ జేయాలని, కోరారు. మాకు తెలియ జేసిన వారి పేరు ను గోప్యంగా ఉచ్చుతామని,బాల్య వివాహాలు చేసేవారి పై కఠినమైన కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. చిన్నారులపై లైంగిక వేధింపులను అరికట్టే శక్తి వంతమైన ఆయుధం పోక్సో చట్టం అని అన్నారు. ఈ చట్టం పై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరం మహిళలు పట్ల అసభ్యంగా ప్రవర్తించినా లేదా లైంగికంగా వేధించినా కఠినమైన శిక్షలు తప్పవు. పాఠశాలు కళాశాలల్లో వివిధ విషయాల పై విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తామని,తెలిపారు. ఈ కార్యక్రమంలో వి.ఆర్.పురం ఎస్.ఐ.సంతోష్,కుమార్, పోలీసు సిబ్బంది. ఉపాధ్యాయులు,మినీ గురుకులం పాఠశాల విద్యార్థులు,తదితరులు పాల్గొన్నారు.

# పనిరాని వస్తువులలో నీరు నిల్వ ఉండ కూడదు

## వైద్య శాల డాక్టర్,అనిల్ కుమార్, హెల్త్, సిబ్బంది




**వి.ఆర్.పురం పెన్.పవర్.జూలై.25:** చింతూరు ఐ.టి.డి.ఏ. పి.ఓ అపూర్వ భరత్,ఆదేశాల మేరకు డిప్యూటీ డి.ఎం.హెచ్.ఓ పుల్లయ్య సూచనలు ప్రకారం రేఖపల్లి ప్రభుత్వ వైద్య శాల డాక్టర్,అనిల్ కుమార్,హెల్త్,సిబ్బంది. ద్వారా మండలంలోని పెద్దమట్ట పల్లి పరిధిలోని పెద్ద మట్టపల్లి,బూరుగువాడ తదితర గ్రామాల్లో మలేరియా డెంగ్యూ,చికెన్,గున్యా,వంటి వ్యాధులు ప్రజలకు సంభ వించకుండా ఉండేందుకు ప్రతి గృహాలలో లార్వా కాంటెనర్స్,పనికిరాని వస్తువులలో ఉన్న నీరును తొలిగించడం చేశారు. కులార్లు ఫ్రిజులు రబ్బరోళ్లు పువ్వుల కుండీలు వంటి వాటితో పాటు ఏ.ఎల్.,ఓ (ఏంటి లార్వా ఆపరేషన్)ఎక్కడ అయితే నీరు నిల్వ ఉన్న మురికి గుంటలు డ్రైనేజీలు చిన్న చెరువు లాంటి వాటిలో తిమోఫస్ అనే మందుతో ఏంటి లార్వా ఆపరేషన్,చేశారు. ఈ కార్యక్రమంలో పి.హెచ్.ఎన్.భద్రకాళి హెచ్.వి.సీత ఎం.టి.ఎస్.రాజేష్,హెచ్.వి.శ్రీనివాస్,సతీష్ రత్తయ్య, సత్యనారాయణ,ఎ.ఎన్.ఎం.లు మహేశ్వరీ,శశి కళ ఆశాలు కన్నమ్మ,సుబ్బలక్ష్మి,బూబమ్మ,తదితరులు పాల్గొన్నారు.



## ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ, అమలాపురం డిపో

**పెన్ పవర్ అమలాపురం రూరల్ జులై 25:** అమలాపురం డిపో నందు AIWC వారి సౌజన్యంతో ONGC–కాకినాడ వారిచే నూతన డస్ట్ బిన్‌ల ఏర్పాటు స్థానిక ఏపీఎస్ఆర్టీసీ అమలాపురం డిపో నందు శుక్రవారం నాడు, డాక్టర్ P.S. శర్మ గారు, (ప్రెసిడెంట్/ఇండియన్ మెడికల్ అసోసియేషన్/ ఏ.పీ. స్టేట్) వారి చొరవతో ఆల్ ఇండియా విమెన్ కార్పొరేషన్ వారి సౌజన్యంతో ONGC– కాకినాడ వారిచే 120 లీటర్ల/60 కేజీల కెపాసిటీ గల 12 నూతన డస్ట్ బిన్ లను బస్ స్టేషన్ నందు ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్ శ్రీ చల్లా సత్యనారాయణ మూర్తి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా విమెన్ కార్పొరేషన్ (AIWC) కార్యదర్శి శ్రీమతి N. భానుమతి, శ్రీమతి M. మీనాక్షి & గౌ" డాక్టర్ P.S. శర్మ గారు, ప్రెసిడెంట్/ IMA పాల్గొని డస్ట్ బిన్లను ఏర్పాటు చేసి, ప్రయాణికులకు క్లీన్ అండ్ హైజినిక్ వాతావరణం కల్పించే దిశలో తాము ఈ డస్ట్ బిన్‌లను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీమతి దేవి గ్యారేజ్ ఇంచార్జ్, శ్రీమతి ప్రతిమా కుమారి ట్రాఫిక్ ఇంచార్జ్, శ్రీ యన్.వరహాలబాబు ఓ .పీ.ఆర్.యస్.సూపర్వైజర్ మరియు డిపో సిబ్బంది పాల్గొని డస్ట్ బిన్ ఏర్పాటుపై వారి కృతజ్ఞతలను తెలియజేశారు.

## ఆధ్యాత్మికత శోభతో కళకళలాడే శ్రావణమాసం



**గోకవరం, పెన్ పవర్, జులై,25:** సిరి సంపదలను ప్రసాదించే శ్రీ మహాలక్ష్మి ఆవిర్భవిం చిన మాసం శ్రావణమాసం. శ్రావణమాసం వచ్చింది అంటే మహిళల్లో ఆనందోత్సాహాలు వెల్లివిరిసి నూతన ఉత్సాహంతో శ్రీ మహాలక్ష్మిదేవిని పూజించడానికి సమాయత్తమవుతారని విశ్వహిందూ పరిషత్ రాజమండ్రి ప్రచార ప్రముఖ్ ఉంగరాల ఆదివిష్ణు అన్నారు. పవిత్ర శ్రావణమాసం విశేషాలను శుక్రవారం ఒక కార్యక్రమంలో ఇలా వివరాంచారు. శ్రావణమాసం వర్ష ఋతువు లో వచ్చే ప్రాముఖ్యత కలిగిన మాసం ఈ మాసంలోనే సాక్షాత్తు శ్రీ మహాలక్ష్మి పాలసముద్రం నుండి ఆవిర్భవించి అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడైన శ్రీమహావిష్ణువును పరిణయమాడి లోకాలకు ఐశ్వర్యాన్ని ప్రసాదించే అదిదేవతగా అవతరించింది అని పురాణ వాంగ్మయం చెబుతుంది. పూర్వం దేవతలు అమృతం కోసం పాలసముద్రాన్ని మదించగా ఆ సముద్ర మదనము జరిగిన సందర్భంలో శ్రావణ పూర్ణిమ కు ముందు వచ్చే శుక్రవారం నాడు లక్ష్మీదేవి ఆవిర్భవించిందని అందుచేతనే ఆమె జన్మదినోత్సవమైన శ్రావణ శుక్రవారం నాడు లక్ష్మీదేవిని పూజిస్తే వారికి ఆ లక్ష్మీదేవి సిరిసంపదలను ఇచ్చి అనుగ్రహిస్తుందని శాస్త్ర వాక్యము అందుచేతనే తెలుగు రాష్ట్రాలలోనే కాక యావత్ భారతదేశం లో కూడా శ్రావణ పూర్ణిమకు ముందు వచ్చే శుక్రవారం నాడు శ్రీమహాలక్ష్మిని యధాశక్తి యధాభక్తితో పూజించి లక్ష్మీదేవి అనుగ్రహానికి పాత్రులు అవ్వడానికి మహిళలంతా శ్రావణ శుక్రవారం వ్రతాన్ని ఆచరిస్తారు. ఈ శ్రావణమాసంలో మరొక రెండు పర్వదినాలు కూడా వస్తాయి శ్రావణ పూర్ణిమ రోజున రక్షాబంధన్ ఉత్సవాన్ని సోదర ప్రేమకు ప్రతీకగా దేశ ప్రజలంతా జరుపుకుంటూ ఉంటారు, అదేవిధంగా శ్రావణ బహుళ అష్టమి రోజున శ్రీమన్నారాయణుడుదుష్ట శిక్షణ శిష్ట రక్షణ కోసం శ్రీకృష్ణ పరమాత్మగా అవతరించారు ఆరోజును శ్రీకృష్ణ జన్మాష్టమి గా జరుపుకుంటాము. ఈ విధముగా ఈ శ్రావణమాసం అంతా కూడా ఆధ్యాత్మిక వాతావరణముతో కళకళలాడేటటువంటి పవిత్రమైన మాసం శ్రావణమాసం అని విశ్వహిందూ పరిషత్ రాజమండ్రి జిల్లా ప్రచార ప్రముఖ్ ఉంగరాల ఆది విష్ణు తెలిపారు.

## కళాకారులను గుర్తించకపోతే సంస్కృతి వెలిసిపోతుంది... రామిశెట్టి నాని





**ప్రత్తిపాడు, పెన్ పవర్, జూలై 25 :** గ్రామీణ జీవితానికి సాంస్కృతిక మూలాలు అందించే కళాకారులను గుర్తించి గౌరవించడం మనందరి బాధ్యతని మండల వైసీపీ కన్వీనర్ రామిశెట్టి నాని పిలుపునిచ్చారు. శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని రౌతుపాలెం సాయినాథుని ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజల సందర్భంగా, ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా ఏలూరు గ్రామానికి చెందిన శ్రీ కృష్ణ నంద బాల భక్త భజన సమాజం ఆధ్వర్యంలో భక్తి పరవశంగా భజన కార్యక్రమం నిర్వహించబడింది. ఇందులో భజన కళాకారుడు సత్యంశెట్టి అమ్మన్నను ఘనంగా సత్కరించారు. ఆయనకు శాలువా కప్పి, పూలమాల వేసి, గ్రామస్తులు, నాయకులు గౌరవం చేశారు. ఈ సందర్భంగా రామిశెట్టి నాని మాట్లాడుతూ "ఒకప్పుడు గ్రామాల్లో కళాకారులకు గొప్ప గౌరవం ఉండేది, నేటి వేగవంతమైన యుగంలో వారి సేవలను గుర్తించకుండా, మరచిపోతున్నాం. మన సంస్కృతి, సాంప్రదాయాలను భద్రంగా నిలబెట్టాలంటే గ్రామీణ కళాకారులకు సన్మానం ఇవ్వాలి, ప్రోత్సహించాలి. ఇది కేవలం మన బాధ్యత మాత్రమే కాదు, మన సంస్కృతికి ఇచ్చే గౌరవం కూడా" అని అన్నారు. ఈ కార్యక్రమంలో ధర్మపూడి శేషు, గోళ్ళ తేజ, కరుసూదుల శేఖర్, సత్యం శెట్టి సాయి చరణ్, కోలా వెంకటేశ్వరరావు, బర్రె బుల్లికాపు, చీకట్ల తాతీలు తదితరులు పాల్గొన్నారు.

## నారాయణ ఈ టెక్నో లో ఎన్నికల పట్టాభిషేకం



**తాడేపల్లిగూడెం, పెన్ పవర్, జులై 25:** తాడేపల్లిగూడెం నారాయణ ఇ టెక్నో స్కూల్లో విద్యార్థుల ఎన్నికల పట్టాభిషేకం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పట్టణ ఎస్ఐ నాగరాజు పాల్గొన్నారు. ఏ జిఎం పి రామిరెడ్డి, ఆర్ ఐ బి.సురేష్, ప్రిన్సిపాల్ ఏ యాన్సీ జ్యోతి ప్రజ్వలన చేశారు ఎస్ ఐ నాగరాజు మాట్లాడుతూ లీడర్ కు ఉండాల్సిన లక్షణాలు, బాధ్యతలు గురించి విద్యార్థులకు వివరించారు. ఆర్ ఐ సురేష్ మాట్లాడుతూ దేశ భవిష్యత్తుకు కావాల్సిన క్వాలిటీ విద్య క్వాలిటీ లీడర్షిప్ అందించడం నారాయణ విద్యాసంస్థలు మాత్రమే సాధ్యం అని కొనియాడారు. తర్వాత పాఠశాల ఎన్నికల్లో గెలుపొందిన ప్రైమరీ నుండి 5వ తరగతి వరకు జూనియర్ హెడ్ బాయ్, జూనియర్ హెడ్ గర్ల్, హై స్కూల్ నుండి హెడ్ బాయ్, హెడ్ గర్ల్, డిప్యూటీ హెడ్ బాయ్, డిప్యూటీ హెడ్ గర్ల్ గా గెలిచారు. గెలిచిన విద్యార్థులచే ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమం లో విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## వర్షాధారంపైనే ఆధారపడి పంటలు పండించుకోవాలి

### జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ



**జగ్గంపేట, పెన్ పవర్, జూలై 25:** గండేపల్లి మండలం తాళ్ళూరు పుష్కర లిఫ్ట్ ఇరిగేషన్ పరిధిలోని రైతులంతా ఈ సంవత్సరం కూడా వర్షాధారంపైనే ఆధారపడి పంటలు పండించుకోవాలని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ స్పష్టం చేశారు. శుక్రవారం ఆయన జగ్గంపేట మండలం రామవరంలో విలేకరులతో మాట్లాడారు. పెన్ పవర్ ప్రతినిధి ప్రశ్నకు బదులుగా ఆయన వివరణ ఇచ్చారు. తాళ్ళూరు లిఫ్ట్ ఇరిగేషన్ అభివృద్ధికి రూ.52కోట్లుతో టెండర్లు పిలవమని ఆన్ రికార్డు సీఎం చంద్రబాబు ఒక నోట్ ఇచ్చారన్నారు. తొందరలోనే టెండర్లు పిలిచి పనులు ప్రారంభిస్తామన్నారు. ఈ సీజన్ లో రైతులు వర్షాలు, చెరువుల ఆధారంగా పంటలు వేసుకోవాలన్నారు. తాము డాంబికాలు, డాబులకు వెళ్లాల్సిన అవసరంలేదని గత ప్రభుత్వం చేసిన నిర్లక్ష్య వైఖరిని సరిదిద్ది ఈవాళ నిధుల లోటు ఉన్నా సరే రూ.52కోట్లు ఒక్కసారిగా ఇచ్చి టెండర్లు పిలవమని ఆదేశాలు ఇచ్చారంటే సీఎం చంద్రబాబుకు రైతాంగంపై ఉన్న చిత్తశుద్ధి ఇదేనన్నారు. అంతేకాకుండా మొల్లేరు, మల్లవరం ఎత్తిపోతల పథకం రూ.130కోట్లతో ప్రారంభిస్తే దాన్ని రాజకీయ దురుద్దేశ్యంతో గత ప్రభుత్వం ఆపేసిందన్నారు. రకరకాల వంకలు చెపుతూ 25 శాతం అవలేదని 17శాతం పూర్తయిందని ఆపేశామని చెపుతున్నారన్నారు. కూటమి ప్రభుత్వం రైతాంగంపై చిత్త శుద్ధి ఉన్న ప్రభుత్వం కాబట్టి గురువారం జరిగిన కేబినేట్లో ఈవిషయాన్ని ప్రస్తావించి పెరిగిన ధరలను అన్వయించుకుంటూ రూ.200 కోట్లతో పని చేయడానికి కేబినేట్ ఆమోదంతో ముందుకు వచ్చిందన్నారు. రైతాంగం మీద చిత్త శుద్ధి ఉన్న ప్రజాప్రతినిధులు ఉన్నప్పుడు ఇలాంటి కార్యక్రమాలు జరుగుతాయని ఒక రోజు అటూ ఇటూలో ఈ పనులన్నీ పూర్తిచేస్తామని ఎమ్మెల్యే నెహ్రూ పేర్కొన్నారు.

## పటవల జాతీయ రహదారిలో ఘోర రోడ్డు ప్రమాదం

### ముగ్గురు దుర్మరణం.. మహిళకు తీవ్ర గాయాలు

**కోరంగి పోలీసులు కేసు నమోదు, దర్యాప్తు ప్రారంభం**



**కాకినాడ స్టాఫ్ రిపోర్టర్,పెన్‌పవర్, జూలై 25:** కాకినాడ జిల్లా రూరల్ సర్కిల్ పోలీసు పరిధిలోని తాళ్లరేవు మండలం పటవల జాతీయ రహదారిలో శుక్రవారం ఉదయం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదం తీవ్ర విషాదాన్ని నింపింది. పైడా కళాశాల సమీపంలో జరిగిన ఈ ప్రమాదంలో ముగ్గురు అక్కడికక్కడే మృతిచెందగా, ఒక మహిళకు తీవ్ర గాయాల య్యాయి. ప్రత్యక్ష సాక్షుల వివరాల మేరకు %-% కాకినాడ నుంచి యానాం వైపు వెళుతున్న ఆటో, ఎదురుగా వచ్చిన ఓ ప్రైవేట్ ట్రావెల్స్ ను ఢీ కొట్టింది. జరిగిన ఘటన అక్కడున్నవారిని కలచివేసింది.

**ఈ ప్రమాదంలో దుర్మరణం పాలైన వారు:**

కూరాకుల కుమార్ (30)ఆటో డ్రైవర్, కురసాంపేట గ్రామం, యానాం ప్రాంతం పోత బత్తుల దుర్గ (55) ఏటిమొగ గ్రామం, కాకినాడ లంకే భవాని (35)దుర్గ కుమార్తె ఇదిలా ఉండగా, అదే ఆటోలో ప్రయాణిస్తున్న మరో మహిళ, సంగాడి సత్యవతి.. గాడిమొగ పంచాయతీ పరిధిలోని చినవలసల గ్రామానికి చెందినవారు, తీవ్రంగా గాయపడింది. స్థానికులు వెంటనే స్పందించి 108 అంబులెన్స్ ద్వారా కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమెకు చికిత్స కొనసాగుతోంది.కోరంగి పోలీసులు కేసు నమోదు..దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్సై పి.సత్యనారాయణ రెడ్డి తెలిపారు. సమాచారం అందుకున్న వెంటనే కోరంగి ఎస్సై పి. సత్యనారాయణ రెడ్డి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ట్రావెల్స్ బస్సును స్వాధీనం చేసుకుని, కోరంగి పోలీసు స్టేషన్‌కు తరలించారు. ప్రమాదానికి కారణమైన వాహనాన్ని, డ్రైవర్‌ను గుర్తించేం దుకు పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. కేసు నమోదు చేసి వివిధ కోణాల్లో విచారణ ప్రారంభించారు.

**మళ్లీ అదే వేగం.. జాతీయ రహదారిపై బలైన ప్రాణాలు**

ఇటీవల కాలంలో తాళ్లరేవు ప్రాంతంలో వేగంగా వెళ్తున్న వాణిజ్య వాహనాల కారణంగా రోడ్డు ప్రమాదాలు పెరుగుతున్నాయి. ఈ ఘటన పటవల జాతీయ రహదారిలోని భద్రతపై మరోసారి ప్రశ్నలెత్తించింది. స్థానికులు, బాధిత కుటుంబ సభ్యులు బాధతో కలచివేసే వాతావరణం నెలకొంది.పోలీసులు పూర్తి స్థాయిలో విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

## ఈవీఎం, వీవీప్యాట్ గోదాముకు పటిష్ట భద్రత ఏర్పాటు చేయండి: కలెక్టర్ షణ్మోహన్ కాకినాడ





**కాకినాడ,పెన్ పవర్, జూలై 25:** కలెక్టరేట్ వద్ద ఉన్న ఈవీఎం, వీవీప్యాట్ గోదామును జిల్లా కలెక్టర్ షణ్మోహన్ శుక్రవారం అధికారులతో కలిసి పరిశీలించారు. భద్రతా ఏర్పాట్లు సక్రమంగా ఉన్నాయా అన్న దానిపై సమగ్రంగా తనిఖీ చేసి, సంబంధిత అధికారుల నుండి వివరాలు అడిగి తెలుసుకు న్నారు. ఈ సందర్బంగా రాష్ట్ర ఎన్నికల కమిషన్ అసిస్టెంట్ సీఈఓ, రాష్ట్ర ఈవీఎం నోడల్ అధికారి పీ. తాతబ్బాయి, రెవెన్యూ, పోలీస్, ఎన్నికల శాఖల అధికారులు కలెక్టరుతోపాటు గోదాం తనిఖీలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ షణ్మోహన్ మాట్లాడుతూ, భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రతి నెల ఈవీఎం, వీవీప్యాట్ గోదాములను క్షుణ్ణంగా తనిఖీ చేసి నివేదిక సమర్పిస్తున్నామని తెలిపారు. ప్రజాస్వామ్య పరిరక్షణలో కీలకమైన ఈవీఎంలకు పటిష్ట భద్రత అత్యవసరం అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఆర్డీవో ఎస్. మల్లిబాబు, కాకినాడ అర్బన్ తహసీల్దార్ వీ. జితేంద్ర, కలెక్టరేట్ ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ ఎం. జగన్నాథం, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## నేలటూరులో పలు ప్రారంభోత్సవాలు



**కపిలేశ్వరపురం పెన్ పవర్ జూలై 25:** కపిలేశ్వరపురం మండలం నేలటూరు లో శుక్రవారం నిర్వహించిన పలు ప్రారంభోత్సవ కార్యక్రమాలలో రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, మండపేట ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. జల్ జీవన్ మిషన్ గ్రాంటు రూ.66.62 లక్షలతో నిర్మించిన 60 వేల లీటర్లు వాటర్ ట్యాంక్ (ఒ.హెచ్.ఎస్.ఆర్), 2500 మీటర్లు హెచ్.డి.పి.ఇ పైపు లైన్లు, 250 ట్యాప్ కనెక్షన్ లకు ఎమ్మెల్యే వేగుళ్ళ ప్రారంభోత్సవం చేశారు. అనంతరం 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.4.50 లక్షలతో నిర్మించిన సి.సి రోడ్లును ఆయన ప్రారంభించారు.ఈ కార్యక్ర మంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

### –డాక్టర్ శ్రీనివాస్ మూర్తి



**కూనవరం,పెన్ పవర్,జూలై 25.** మండలంలోని కూటురు సచివాలయ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఉన్నటువంటి గ్రామాలకు డాక్టర్ శ్రీనివాస్ మూర్తి ఆధ్వర్యంలో యాంటీ లార్వా మందును పిచికారీ చేసి మురికి గుంటల వద్ద స్ప్రే చేశారు.ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా చూసుకోవాల్సిన బాధ్యత గ్రామ ప్రజలపై ఉన్నదని అన్నారు.దోమలు విజృంభించడానికి ముఖ్య కారణం పరిసరాలు శుభ్రంగా లేకపోవడం,మురుకు నీరు ఉండడం,కొబ్బరి బొండాలు,టైర్లు,పాత సామాన్లు,డబ్బాలలో నీరు నిల్వ ఉండడం వలన వాటిలో దోమలు గుడ్లు పెట్టడం జరుగుతుందని తద్వారా దోమలు దాడి చేస్తాయని,తద్వారా మలేరియా,డెంగ్యూ,టైఫాయిడ్ కు కారణం అవుతామని తెలిపారు. యాంటీ లార్వా మందు మురికి గుంటలలో స్ప్రేయింగ్ చేయడం వలన దోమ గుడ్లు, దోమ లార్వని నివారించడం జరుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ పాయం సీతారామయ్య, హెల్త్ అసిస్టెంట్ సోడి బజార్, ఏఎన్ఎం,ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.





## జగ్గంపేట సీఐ, గండేపల్లి ఎస్సైకు ఎస్పీ అభినందన

**జగ్గంపేట, పెన్ పవర్, జూలై 25:** మెగా జాతీయ లోక్ అదాలత్ ద్వారా కాకినాడ జిల్లా జగ్గంపేట పోలీస్ స్టేషన్‌లోని 116, గండేపల్లి పోలీస్ స్టేషన్ లో 116 కేసులు పరిష్కరించి జిల్లాలో ప్రథమ స్థానం సాధించిన జగ్గంపేట సిఐ వైఆర్కే శ్రీనివాస్, గండేపల్లి ఎస్సై యు వి శివ నాగబాబును కాకినాడ జిల్లా ఎస్పీ బిందు మాధవ్ అభినందించారు. శుక్రవారం కాకినాడలో జరిగిన నెలవారి నేర సమీక్ష కార్యక్రమంలో భాగంగా వీరిని అభినందించి ప్రశంసా పత్రం అందజేశారు. కక్షిదారులు, ఫిర్యాదుదారులు, ఇరు వర్గాల సభ్యులను సమన్వయం చేసుకుంటూ వారితో మాట్లాడి వారి యొక్క కేసులను లోక్ అదాలత్ కార్యక్రమం ద్వారా పరిష్కారానికి అత్యధిక స్థాయిలో కృషిచేయడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా జగ్గంపేట సీఐ వై ఆర్ కే శ్రీనివాస్, గండేపల్లి ఎస్సై యు వి శివ నాగబాబును ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు, స్థానిక ప్రజలు అభినందించారు.

## గొల్లపాలెంలో డోర్ టు డోర్ కార్యక్రమం

### సుపరిపాలన తొలిగడుగు కార్యక్రమంలో భాగంగా ప్రజల్లోకి సంక్షేమ పథకాల ప్రచారం



**కాజులూరు, జూలై 25 పెన్ పవర్:** మండల పరిధిలోని గొల్లపాలెం గ్రామంలో శుక్రవారం సుపరిపాలన తొలిగడుగు కార్యక్రమం భాగంగా గ్రామ కమిటీ అధ్యక్షుడు నక్క శ్రీను నడిపిన డోర్ టు డోర్ కార్యక్రమం మంచి స్పందన పొందింది. ఈ సందర్భంగా శ్రీను ఇంటింటికీ వెళ్లి పార్టీ కరపత్రాలను పంపిణీ చేయడంతో పాటు, సుపరిపాలన యాప్ ద్వారా ప్రజల అభిప్రాయా లను సేకరించారు. ముఖ్యంగా ప్రజలు పొందుతున్న సంక్షేమ పథకాలపై వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు. చంద్రబాబు నాయకత్వంలో అమలవుతున్న తల్లికి వందనం, ఇంటికే డాక్టర్, పింఛన్ డోర్ డెలివరీ, వైద్య ఆరోగ్య సేవలు వంటి పథకాలు గురించి ప్రజలు వివరంగా చెప్పడంతో, వాటి ప్రభావం గ్రామస్థాయిలో స్పష్టంగా కనిపించింది. **తల్లికి వందనం పథకంపై ప్రశంసలు:** ఈ కార్యక్రమంలో పాల్గొన్న పలువురు మహిళలు తమ పిల్లల విద్యాభివృద్ధికి తల్లికి వందనం పథకం ఎంతగానో ఉపయోగపడు తోందని తెలిపారు. పథకం కింద వచ్చిన నిధులు తమ ఖాతాల్లో జమైనట్లు వారు ధృవీకరించారు. ప్రజలకు నేరుగా ఇంటికే వెళ్లి, వారి స్పందనను తెలుసుకోవడం ద్వారా ప్రజల నమ్మకాన్ని గెలుచుకోవచ్చు నని నిర్వాహకులు తెలిపారు. వినూత్న రీతిలో ప్రజల మనసు గెలవడం.ఇలా ప్రతి ఇంటిని సందర్శిస్తూ ప్రభుత్వ పథకాలను వివరిస్తూ, ప్రజల అభిప్రాయాలను నమోదు చేయడం ద్వారా గ్రామ కమిటీ ప్రజలలో ఆత్మీయతను పెంపొందించింది. గ్రామ అభివృద్ధికి ఇది మంచి శుభసంకేతమని పలువురు అభిప్రాయపడ్డారు. కూటమి కాదు, అభివృద్ధే చిరునామా కావాలన్న లక్ష్యంతో ఈ కార్యక్రమం ముందుకు సాగుతోంది. సుపరిపాలనకు గ్రామస్థాయిలో సాధనగా డోర్ టు డోర్ కార్యక్రమం నిలుస్తోందని నాయకులు తెలిపారు.